


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 44 | శుక్రవారం 13 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


## రావణ వాహనంపై విహారం

ఆది దంపతులను దర్శించుకున్న భక్తజనం

వైభవంగా శ్రీగిరిపై బ్రహ్మోత్సవాలు





# రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

## సభలో ఎంపీ నోటీసు

అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు

నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు

దేశాన్ని అమ్మేశారన్న రాహుల్

వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం

2లో

లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు.

ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే. రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు.

ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.



# మండలిలో మాటల యుద్ధం

## బొత్స, మంత్రి పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు. అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

ఏపీ శాసనమండలిలో సంక్షేమ పథకాలపై తీవ్ర వాగ్వాదం

ప్రభుత్వ వాదనలు అబద్ధమని, నిరూపిస్తే క్షమాపణ చెబుతానని బొత్స సవాల్

బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి ప్రతిసవాల్

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపై ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం

పింఛన్ల తొలగింపు ఆరోపణలపై వివరణ ఇచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

2లో

## తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి



2లో

తెలంగాణకు తానే రాజు తానే మంత్రినని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాను ఎవరితోనూ పోల్చుకోనని.. తనకు ఎవరూ పోటీ కారన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాలో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 2029లో జమిలి ఎన్నికలు రానున్నాయని ఆయన జోస్యం చెప్పారు. పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్య మంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. ఎన్టీ ఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వడంపై తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

# భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ

పెట్టుబడుల రాకుండా వైకాపా కుట్రలు

రియల్ ఎస్టేట్ సంస్థలకు భూ కేటాయింపులు అబద్ధం

క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున కేటాయింపు

విపక్ష సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టిన మంత్రి లోకేశ్

2లో



## రాజమండ్రి జైలుకు అంబటి తరలింపు

లాటరీ టిక్కెట్ల కేసులో రిమాండ్



2లో

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు కోర్టు మరోసారి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు గుంటూరు స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి పండగ వేళ.. సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో బలవంతంగా టికెట్లు కొనుగోలు చేసేలా వ్యవహరించిన కేసులో అంబటి రాంబాబుకు న్యాయమూర్తి ఈ రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు అంబటి రాంబాబును భారీ బందోబస్తు నడుమ తరలించారు.





## నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదు

అసెంబ్లీలో మాట్లాడే చాన్స్ లేనందునే మీడియాతో మాట్లాడుతున్నా: జగన్

'కల్తీ నెయ్యి'తో వైసీపీకి సంబంధం లేదంటూ అవే అబద్ధాలు

2లో

అసెంబ్లీలో తన గొంతు నొక్కేందుకే ప్రధాన ప్రతిపక్షనేత హోదా ఇవ్వడంలేదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సభలో ఏకైక ప్రతిపక్ష పార్టీ వైసీపీ అయినా ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబుతో సమానంగా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశపూర్వకంగా తనకు హోదా ఇవ్వడం లేదని అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాగొంతుకై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకూడదనే

## రూ.30 లక్షలకే 30 ఎకరాలు

జగన్ జమానాలో బొత్స కుటుంబానికి అయాచిత లబ్ధి

పెట్టని పరిశ్రమకు గ్రోత్ సెంటర్‌లో భూములు అడ్డగోలుగా కేటాయించిన వైసీపీ

ఇప్పుడు 'గీతం' భూముల క్రమబద్ధీకరణపై యాగీ

2లో

ప్రతిష్ఠాత్మకమైన 'గీతం' యూనివర్సిటీకి భూమి ఇవ్వడాన్ని తప్పుబడుతున్న శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ.. తాను మాత్రం ఎంచక్కా ప్రభుత్వ భూములు సొంతం చేసుకున్నారు. పెట్టని పరిశ్రమ పేరుతో... రూ.30 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.30 లక్షలకే తీసేసుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఇథనాల్ డిస్టిలరీ యూనిట్ పెడతామని, 30 ఎకరాలు కేటాయించాలని బొత్స సత్యనారాయణ కుమారుడు సందీప్, కుటుంబ సభ్యులు ఆదినారాయణ, శ్రీధర్,

## తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా



ఉద్యమకారులకు అన్యాయం జరిగింది

ఊహించిన దానికి భిన్నంగా నిర్ణయాలు

అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది

కోదండరామ్ లాంటి వారు ఆలోచన చేయాలి

తన పక్కన పైరవీకారులు లేరన్న కవిత

2లో

## ఆత్మీయ కలయిక - ఇల్లే వేదిక!...



మంత్రి లోకేశ్ వినూత్న కార్యక్రమం..

ఎమ్మెల్యేలతో డిన్నర్ భేటీలు

కుటుంబసమేతంగా ప్రజాప్రతినిధులకు తన నివాసంలో విందు

మచిలీపట్నం పార్లమెంట్ నేతలతో తొలి సమావేశం

సమస్యలపై చర్చ, వినతులపై నివేదిక అందజేత

మహిళలకు మంగళగిరి పట్టుచీరలు బహూకరించిన లోకేశ్

2లో

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ప్రజా ప్రతినిధులతో సంబంధాలను

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా

తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమకారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాల రాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రొ.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రొ.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన ఆరేండ్ల తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టారని మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. 1995లో వరంగల్ డిక్లరేషన్ తో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందని ఆమె చెప్పారు. స్వరాష్ట్ర ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి వారు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ తెలంగాణ గడ్డపై విరామం లేకుండా ఒకదాని తర్వాత మరొక ఉద్యమం కొనసాగుతూనే వచ్చిందన్నారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారని, నిప్పుకణికలా మండుతున్న ఉద్యమాన్ని అగ్గిరాజేసిండని అన్నారు. 2014లో తెలంగాణ తెచ్చుకున్నంక ఉద్యమకారులకు దక్కుతదని అనుకున్నమో వారికి న్యాయం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సరైన న్యాయం జరగలేదని ఎక్కడైనా ఉద్యమకారులకు పదవులు దక్కితే వారు మిగతా వారిని పురుగులను చూసినట్లు చూశారని విమర్శించారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో మనను కొట్టించారో వారు సార్ పక్కనే చేరిండ్రు.. కేశవరావు జాదవ్ చనిపోతే ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయా..? జయశంకర్ బొమ్మ కేబీఆర్ పార్కు వద్ద పెట్టాలని నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ను పదే పదే అడిగిన.. సుప్రీంకోర్టు తీర్పు అడ్డొచ్చింది.. ట్యాంకు బండ్ మీద పెడతామన్న పెట్టుకోలేక పోయినం.. అక్కడున్న ఆంధ్రోళ్ల విగ్రహాలు తీస్తరని అనుకున్నం... తీయకపోతివి.. కనీసం మనోళ్ల విగ్రహాలైన పేట్టకపోతివి.. ఆ బాధ వెంటాడుతూనే ఉన్నది. ఇప్పుడొచ్చినైన ఎవరి బొమ్మలు పెడుతుండో అర్థం కాని పరిస్థితి ఉంది. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ను పట్టుకొని తిరిగిన రేవంత్ రెడ్డిని గెలిపించుకున్నం.. ఆయనకు ఏం సోయి ఉంటది తెలంగాణ అంటే. రవీంద్ర భారతిలో గద్దర్, బిరదరాజు రామరాజు, సుద్దాల విగ్రహాలు ఉండాల్సింది... ఎవరి విగ్రహాలున్నాయి. చేతులో ఉన్నప్పుడు చేసుకోలేదు. ఇప్పుడు మన చేతులో పోరాటం తప్ప ఏమీ లేదు. ఇప్పుడు పోరాడితేనే ఉద్యమ కారులకు న్యాయం జరుగుతుంది.' అని కవిత అన్నారు. తెలంగాణలోని ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇందుకోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని చెప్పారు. వందల, వేల సంఖ్యలో ఉద్యమకారులు ఈ రాష్ట్రంలో ఉన్నారని, ఇందుకోసం యాప్ లాంచ్ చేశామని అందులో వివరాలు నమోదు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాబోయే బ్జడెట్లో నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. చేయకుంటే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డిని కాదు ప్రొఫెసర్ కోదండరామ్ ను హెచ్చరిస్తున్నానన్నారు.

## ఆత్మీయ కలయిక - ఇల్లే వేదిక!...

బలోపేతం చేసుకునేందుకు, వారి నియోజకవర్గ సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'ఆత్మీయ కలయిక.. ఇల్లే వేదిక' పేరుతో డిన్నర్ సమావేశాలను ప్రారంభించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో, గురువారం నుంచి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా తన నివాసానికే ఎమ్మెల్యేలను, వారి కుటుంబ సభ్యులను విందుకు ఆహ్వానిస్తున్నారు. మొదటి సమావేశం మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులతో జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్ వారితో, వారి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఇది కేవలం విందుకే పరిమితం కాలేదు. నియోజకవర్గాల్లోని సమస్యలపై వారితో చర్చించి, గతంలో వారు ఇచ్చిన వినతుల తాజా పరిస్థితిని నివేదిక రూపంలో అందజేశారు. ఈ ఆత్మీయ కలయికకు వచ్చిన ఆడపడుచులకు లోకేశ్ మంగళగిరి పట్టుచీరలను బహూకరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే మార్చి 7వ తేదీ వరకు ఈ డిన్నర్ సమావేశాలు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఒక జిల్లాకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో కలిసి ఈ విందులో పాల్గొంటారు. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. కూటమి ఐక్యత క్షేత్రస్థాయిలోనూ కొనసాగాలని, సభలో అంశాలపై పూర్తి సన్నద్ధతతో ఉండాలని హితవు పలికారు. తాను కూడా సుమారు 40 మంది ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి పనితీరును సమీక్షిస్తానని స్పష్టం చేశారు.

## నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదు

వైసీపీని ప్రతిపక్షంగా గుర్తించలేదని ఆరోపించారు. అసెంబ్లీలో వైసీపీకి బలం తక్కువని, పార్టీ గొంతు వినపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. శాసనసభలో గొంతెత్తి మాట్లాడే అవకాశం లేనందునే మీడియాతో బయట మాట్లాడుతున్నామని అన్నారు. శాసనమండలిలో బలం ఉన్నందున అక్కడ ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడుదామని, ఎమ్మెల్సీలు సభలో గట్టిగా మాట్లాడాలని సూచించారు. కల్తీ నెయ్యి సరఫరాతో వైసీపీకి ఏమాత్రం సంబంధం లేదని, తమ ప్రభుత్వ హయాంలో జరగలేదని, సీబీఐ చార్జిషీట్‌లోనూ ఇదే ఉందన్నారు. సీబీఐ చార్జిషీట్‌కు చంద్రబాబు సమాధానం చెప్పాలని, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర రెడ్డిపై దాడులు చేశారన్నారు. కాకాణి గోవర్ధనరెడ్డిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ చంద్రబాబు చేయించినవేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయమన్నారు.

## రూ.30 లక్షలకే 30 ఎకరాలు

సతీశ్‌కుమార్ ఏపీఐఐసీకి 2023 జూన్‌లో దరఖాస్తు చేశారు. రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ తయారు చేస్తామని, రూ.235 కోట్ల పెట్టుబడి పెడతామని, 200 మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. అక్కడ భూమి విలువ ఎకరా రూ.కోటి ఉందని, రూ.30 కోట్లు చెల్లించాలని ఏపీఐఐసీ సూచించగా,

తాము అంత చెల్లించలేమని, ఎకరా రూ.10 లక్షలకే ఇవ్వాలని కోరారు. నాటి సీఎం జగన్ ఆదేశాలతో వారు అడిగిన ధరకే ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. అంటే ఎకరా రూ.10 లక్షల చొప్పున 30 ఎకరాలను 3కోట్లకు ఇచ్చేశారు. అయితే బొత్స కుటుంబం రూ.30లక్షలే చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అందులో ఇప్పటివరకూ పరిశ్రమ ఏర్పాటుచేయలేదు. అదే సమయంలో లక్షలాది మందికి విద్యాబోధన చేసి, వేలాది మందిని వివిధ దేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లోకి పంపిన గీతం యూనివర్సిటీ...ఎప్పటినుంచో తమ ఆధీనంలో ఉన్న 54 ఎకరాలను క్రమబద్ధీకరించాలని కోరితే బొత్స తప్పుబడుతున్నారు. శాసనమండలిలో నానా యాగీ చేస్తున్నారు.

**'గీతం'లో జరిగిందేమిటి?** మంత్రి లోకేశ్‌కు 'గీతం' అధ్యక్షుడు శ్రీభరత్ తోడల్లుడు కావడం వల్లే విలువైన భూములు కట్టబెడుతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవానికి గీతం అధ్యక్షులుగా ఎంవీవీఎస్ మూర్తి ఉన్నపుడే ఆ భూమిని క్రమబద్ధీకరించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నారు. సొంత కుటుంబ సభ్యులకు మేలుచేయాలని చంద్రబాబు భావిస్తే...ఆనాడే గీతంకు ఆ భూములు ఇచ్చేసి ఉండేవారు. కానీ నిబంధనలు, షరతులు, ప్రభుత్వ అవసరాలు అన్నీ చూసుకొని...

వాయిదా వేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ భూములను రాత్రికి రాత్రి వందలాది మంది పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో వెళ్లి, బీచ్ రోడ్డును స్తం భింపజేసి, తెల్లవారేసరికి స్వాధీనం చేసుకుంది. గీతం యాజమాన్యం ఆ భూమిలో కంచె కూడా వేయలేదు. అనేక విద్యా సంస్థలకు భూములు తక్కువ ధరకు ఇస్తున్నారని, దశాబ్ద కాలం నుంచి అడుగుతుంటే తమకు ఇవ్వడం లేదని, యూనివర్సిటీ విస్తరిస్తున్నామని, మరెంతో మందికి ఉపయోగపడుతుందని కోరితే, ఇప్పుడు మంత్రివర్గం దానిని పరిశీలనలోకి తీసుకుంది.

## రావణ వాహనంపై విహారం

శ్రీగిరిపై మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రానందభరితంగా సాగుతున్నాయి. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి రావణ వాహనంపై పుర వీధుల్లో విహరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో పుష్పాలంకరణ చేసిన ప్రత్యేక వేదికపై రావణ వాహనంలో ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన గోపురం నుండి మాడవీధి, నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయాల గుండా గ్రామోత్సవం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు చేసిన నృత్యాలకు ఆకర్షితులైన మంత్రి ఆనం కళాకారులతో కలిసి అడుగులు కలిపారు. గ్రామోత్సవంలో ఈవో శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ పోతుగుంట రమేష్‌నాయుడు, సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ఏవీ రమణ. అనిల్ కుమార్, శివమ్మ, ఆలయ అధికారులు ఈఈ నర్సింహారెడ్డి, బాలమురళీకృష్ణ, పీఆర్వో శ్రీనివాసరావు, ఎడిటర్ అనీల్ కుమార్ ఆలయ ముఖ్య భద్రతాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పట్టు వస్త్రాల సమర్పణ** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రాంచంద్రమోహన్, కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ పోతుగుంట రమేష్‌నాయుడు, సభ్యులు దేవకి వెంకటేశ్వరరావు, ఆల అనీల్‌కుమార్, కట్ట సుధాకర్ రెడ్డి, ఏవీ రమణ, మురళీధర్, శివమ్మ ఆలయ సంప్రదాయం ప్రకారం తిలక ధారణ చేసి మేళతాళాలతో స్వాగతం పలికారు. కృష్ణ దేవరాయ గోపురం వద్ద పట్టు వస్త్రాలకు పూజాదికాలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణలు చేసిన అనంతరం స్వామి అమ్మవార్లకు సమర్పించారు. ప్రభుత్వ ప్రతినిధులు మల్లన్నకు ప్రత్యేక పూజలు చేసుకుని పరివార దేవతాలయాలను దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్, కలెక్టర్‌లను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## గతంలో హెరిటేజ్ సంస్థ రూ. 278కే నెయ్యి సరఫరా

తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి ధర, నాణ్యత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు. గతంలో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తయారీ యూనిట్ అయిన ఇందాపూర్ ఫుడ్స్ అండ్ డెయిరీ ప్రొడక్ట్స్.. టీటీడీకి కేజీ నెయ్యిని రూ. 278 నుంచి రూ. 306 ధరలకే సరఫరా చేసిందని భూమన గుర్తుచేశారు. రూ. 300 లోపు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందని ఇప్పుడు ప్రశ్నిస్తున్న చంద్రబాబు, ఆనాడు సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆశ్చర్యకరంగా, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే యూనిట్ సరఫరాదారుగా వచ్చి, ఇప్పుడు కేజీ నెయ్యిని ఏకంగా రూ. 658కి సరఫరా చేస్తోందని భూమన ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెరిటేజ్ తయారీ యూనిట్, కర్ణాటకకు చెందిన మరో సంస్థతో కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. గతంలో రూ. 278కి సరఫరా చేసినప్పుడు నాణ్యమైనదిగా భావించి, ఇప్పుడు ధరను రూ. 658కి ఎలా పెంచారని.. దీని వెనుక ఏదైనా వ్యాపార ఒప్పందం ఉందా అని సీఎం సమాధానం చెప్పాలని భూమన నిలదీశారు. గతంలో చంద్రబాబు హయాంలో ఈ రెండు యూనిట్లు 40 లక్షల కేజీలకు పైగా నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని భూమన డిమాండ్ చేశారు.

## హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి

### తిరుమల లడ్డూ వ్యవహారంపై పదేపదే మాట్లాడొద్దు

### మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఏపీలో ఈ అంశంపై అధికార పక్షం, వైసీపీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ అంశంపై తాజాగా జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంగా చెప్పారని బాలినేని అన్నారు. ఆ అంశంపై పదేపదే మాట్లాడటం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని చెప్పారు. ఇంతటితో ఈ అంశాన్ని వదిలేయడం మంచిదని... ఎవరైనా తప్పు చేసి ఉంటే వారి సంగతి వేంకటేశ్వరస్వామి, సీబీఐ వాళ్లు చూసుకుంటారని అన్నారు. ప్రకాశం జిల్లాలో జనసేన పార్టీ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనేది తమ అధినేత పవన్ కల్యాణ్ చూసుకుంటారని చెప్పారు.

## తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి

ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎంత నష్టం జరిగిందో.. అంచనా కోసం కమిటీకి బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. కమిటీ నివేదిక అందిన తర్వాతే కాళేశ్వరంపై ఆలోచిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

**పెండింగ్‌లో పెట్టిన కేంద్రం: సీఎం రేవంత్** కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రాన్ని కోరామన్నారు. కానీ ఈ అంశాన్ని కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. ఈ అంశంలో సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు పిల్లర్లు మాత్రమే కూలాయని చెప్పడం పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్ట్ లోపల బాంబు పెడితే పైన పేలుతుంది.. కింద కూలదని స్పష్టం చేశారు. మూడు పిల్లర్లా?.. ముప్పయ్ పిల్లర్లా? అనేది కమిటీ నిర్ధారించిన తర్వాత చెబుతామని చెప్పారు. కృష్ణా జలాలపై తాము అడిగినవన్నీ ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కి సైతం సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కవిత పార్టీ గురించి తమకు తెలియదన్నారు.

**హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం: తెలంగాణ సీఎం** ఎన్టీఆర్ జాతీయ నాయకుడు.. ఆయన ఏ ఒక్కరికి సొత్తు కాదని.. జాతీయ సొత్తు అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తాను వ్యక్తిగతంగా డిమాండ్ చేస్తున్నానన్నారు. ఎన్టీఆర్ గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే వారంతా మూర్ఖులు ఎవరు ఉండరన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దత్తపుత్రుడని పునరుద్ఘాటించారు. కాళేశ్వరంపై 48 గంటల్లో విచారణ చేయిస్తామని కిషన్ రెడ్డి గతంలో ప్రకటించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదంటూ కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంపై తాము నేరుగా సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాశామని వివరించారు.

**ఆయన విచారణ తర్వాతే.. ఒక్కొక్కరికి నోటీసులు: సీఎం రేవంత్** జడ్జీలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్లు సైతం ట్యాప్ చేశారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కారకుడు ప్రభాకర్‌రావు 20 నెలలపాటు విదేశాలకు పారిపోయారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని వివరించారు. ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే ఒక్కొక్కరికి సిట్ నోటీసులు జారీ చేస్తోందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్ఐబీలో కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు.. సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## మండలిలో మాటల యుద్ధం..

"నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు. ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

## రాజమండ్రి జైలుకు అంబటి తరలింపు

సంక్రాంతి పండగ వేళ సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో టికెట్లు విక్రయించారు. వీటిని ప్రజలకు వైసీపీ నేత అంబటి రాంబాబు బలవంతంగా విక్రయించేలా చర్యలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయనపై జనసేన పార్టీకి చెందిన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అంబటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అంబటిపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు అంబటిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. తాజాగా లక్కీ డ్రా కేసులో ఈ రోజు గుంటూరు కోర్టులో అంబటిని సత్తెనపల్లి పోలీసులు హాజరుపరిచారు. ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ.. స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దాంతో గుంటూరు నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు ఆయన్ని తరలించారు.

## పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

### అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలి

### ముందు జాగ్రత్త చర్యలపై అధికారులతో సిఎస్ సమీక్ష

భారీ పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు, కార్మికుల భద్రతకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉన్నతాధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, చర్యలపై స్పష్టమైన ఒక మాన్యువల్ ను సిద్ధం చేయాలని సి.ఎస్ ఆదేశించారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిగాచి ఇండస్ట్రీస్‌లో జరిగిన దుర్ఘటన పై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులతో సి.ఎస్ సమీక్షించారు. ఈ ప్రమాదంలో మరణించిన కార్మికుల, బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లింపులు, కోర్టు కేసుల పురోగతిపై సంబంధిత విభాగాల ఉన్నతాధి కారులతో సి.ఎస్ సమీక్ష చేశారు. ఈసందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భారీ, మధ్యతర, చిన్నతరహా పరిశ్రమలలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో వివిధ విభాగాలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించుకోవడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు రెగ్యులర్ మానిటరింగ్ ఉండే విధంగా అధికారులతో తనిఖీ నిర్వహించాలని అన్నారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పరిశ్రమలు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో కూడిన తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఆ వివరాలను ఆన్ లైన్ లో పొందుపరిస్తే అన్ని విభాగాల అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సి.ఎస్ అన్నారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు, భద్రతా ఆడిట్, అలాగే కార్మికుల భద్రతకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సి.ఎస్ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సంజయ్ కుమార్, దాన కిషోర్, ్ర÷ర్ సర్వీస్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఈఅఅం) కమిషనర్ శశాంక, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# శ్రీశైల దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో టెలికాం సేవలపై సమీక్ష

### భక్తులకు నిరంతర ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**శ్రీశైలం ఫిబ్రవరి 12 (నంది పత్రిక)** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలనుబు పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రానికి భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, కమ్యూనికేషన్ సేవలు అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సెల్ ఫోన్ టవర్ సంస్థల ప్రతినిధులను సూచించారు. గురువారం శ్రీశైల దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ గారితో కలిసి బిఎస్ఎన్ఎల్ అధికారులు, వివిధ సెల్ ఫోన్ టవర్ సంస్థల ప్రతినిధులు, ఫైబర్ నెట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు రోజుల్లో సుమారు మూడు లక్షల మంది భక్తులు శ్రీశైలానికి రానున్న నేపథ్యంలో, ఫోన్ కాల్స్ మరియు ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని... భక్తులకు ఎటువంటి సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, క్యూలైన్లు, దేవస్థానం పరిసరాలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ ప్రదేశాలు, నడకదారి మార్గాలలో సిగ్నల్ ఫ్రీక్వెన్సీని పెంచి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. తాత్కాలిక మొబైల్ టవర్లు (మొబైల్ బూస్టర్ యూనిట్లు) ఏర్పాటు చేయడం, ప్రస్తుత టవర్ల సామర్థ్యాన్ని పెంపొందించడం, ఫైబర్ నెట్ కనెక్షన్లను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి కాల్ డ్రాప్స్, నెట్‌వర్క్ జామ్ సమస్యలు లేకుండా 24 గంటల మానిటరింగ్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యం దృష్ట్యా సేవలలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించే విధంగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని టెలికాం సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ స్పష్టం చేసారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ గారు మాట్లాడుతూ, అత్యవసర సేవలు, పోలీస్ కంట్రోల్ రూమ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యల సమన్వయం కోసం నిరంతర కమ్యూనికేషన్ అత్యంత కీలకమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో దేవస్థానం అధికారులు, టెలికాం విభాగ సిబ్బంది, ఫైబర్ నెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా



**శ్రీశైలం ఫిబ్రవరి12(నంది పత్రిక)** స్నాన ఘట్టాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, టాయిలెట్ల పరిశుభ్రత, రన్నింగ్ వాటర్ అందుబాటు వంటి అంశాలను స్వయంగా తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్‌లి భక్తుల కోసం ఏర్పాటు చేసిన దుస్తులు మార్చుకునే గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గజ ఈతగాళ్లు (లైఫ్ గార్డులు) ఎంతమంది విధుల్లో ఉన్నారు? వారు నిరంతరం అందుబాటులో ఉన్నారా? అనే అంశాలపై ఆరా తీసిన జిల్లా కలెక్టర్ అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన చర్యలకు సిద్ధంగా ఉంచాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించిన కలెక్టర్



# సురేందర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం





**బద్వేల్ ఫిబ్రవరి 12 (నంది పత్రిక):** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం లో ప్రధాన మంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరగడమైనది. ఈ కార్యక్రమంలో పట్టణం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వై శ్రీనివాసులు మరియు సంజీవిని ప్రైవేట్ హాస్పిటల్ బద్వేల్ స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ శివ లలిత వారు పాలుగ్గొని వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ రక్తహీనత లేకుండా, మంచి బలవద్దకు ఆహారం తీసుకొని సురక్షక కాన్పు కావాలని అదేవిధంగా స్త్రీ వ్యాధి నిపుణులు మరియు వైద్యాధికారులు దగ్గర గర్భవతి సమయంలో సలహాలు సూచనలు తీసుకుని ఆసుపత్రుల నందు జరుగు రక్త పరీక్షలు, హైపర్ టెన్షన్ డయాబెటిస్ మొదలగు పరీక్షలు అన్నీ కూడా ఉచితముగా గవర్నమెంట్ హాస్పిటల్ నందు అందించబడునని అదేవిధంగా గవర్నమెంట్ హాస్పిటల్ లో కాన్పు జరిగినట్లయితే ఉచిత వైద్యము ఉచిత రక్త పరీక్షలు ఉచిత రవాణా కొరకు 108, మరియు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద ప్రతి మొదటి కాన్పుకు రెండు విడతలగా 5000 రూపాయలు, ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు అయితే పట్టణము 600 అదే గ్రామీణ ప్రాంతంలో అయితే 1000 రూపాయలు మరియు ప్రైవేట్ హాస్పిటల్లో మరియు గవర్నమెంట్ హాస్పిటల్ నందు కాన్పు అయిన వారికి ఆరోగ్యఆసరా కింద ఐదులూరు వేల రూపాయలు అందించబడినని పేర్కొన్నది. ఈ కార్యక్రమంలో లాప్ టెక్నీషియన్ సుభాన్ వారుఆధ్వర్యంలో దాదాపు 36మంది గర్భిణీ స్త్రీలకు ఉచిత రక్త పరీక్షలు పైన సీక్సెల్ అని మియా హిమోపిలియాకు సంబంధించినటువంటి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం సంబంధించినది మొదలగు పరీక్షలు చేయడమైనది , అదే విధంగా సంక్రమణ, అసంక్రమణ వ్యాధులైన బీపీ, షుగర్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నటువంటి వారిని ఆరోగ్య పరీక్షలు జరిపి ఏదైనా అంగవైకల్యం ఉన్నటువంటి వారిని గుర్తించి పై అధికారులకు తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంత ఉందని సిబ్బందికి ఆదేశించడం అయినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య మాట్లాడుతూ బాలికలకు సరైన వయసులో వివాహము చేయాలని బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని అదే విధంగా లింగ నిర్ధారణ జరగకుండా లింగ వివక్షత లేకుండా గర్భస్థ ముందు గర్భస్రావాలు జరక్కుండా ఆడైనా మగైనా ఇద్దరు సమానులని లింగ నిర్ధారణ పైన గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించడం అయినది,ప్రతి గర్భిణీ స్త్రీ నెలలో 9వ తారీకు జరుగు ప్రధానమంత్రి మాతృత్వం అభియాన్ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్లు ఇచ్చినటువంటి సలహాలు సూచన పాటించి మంచి పోషకాహారం తీసుకొని రక్తహీనత లేకుండా చూసుకోవాలని అదేవిధంగా అంగన్వాడి సెంటర్లు ఇచ్చినటువంటి పోషకాహారం కూడా ఉపయోగించుకొని రక్తహీనత లేకుండా ఏఎన్ఎం వారు ఇచ్చు రక్తహీనత మాత్రలు గర్భవతి సమయం లో 180, 360 క్యాల్షియం మాత్రలు తీసుకోవాలని లింగ నిర్ధారణ చట్టంపై గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించి ఆడైనా మగైనా ఇద్దరు సమానమని బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పైన 108,104 102 వాహనాల పైన గర్భిణీ స్త్రీలకు వివరించడమైనది, కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి జనార్ధన్ రావు పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్న మైనది.

# సమ్మెకు ఏపీయూడబ్ల్యూజే మద్దతు




**కర్నూలు ప్రతినిధి. ఫిబ్రవరి 12. (నంది పత్రిక ):** కేంద్ర ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దు చేస్తూ.. కొత్తగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే)మద్దతు పలికింది. గురువారం జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొనడంతో పాటు కలెక్టరేట్ ముందు జరిగిన ధర్నాలో కూడా నేతలు పాల్గొనడం జరిగింది. కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ల వల్ల జర్నలిస్ట ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా మాజీతీయా వేజ్ బోర్డు అమలు అటకెక్కే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఉద్యోగ భద్రత గాల్లో దీపంగా మరే అవకాశం ఉందన్నారు. అలాగే జర్నలిస్టు యూనియన్ స్వరం కూడా మూగబోయే ప్రమాదం ఉందన్నారు. మొత్తం మీద జర్నలిస్టుల హక్కులు కాలరాసే విధంగా నాలుగు కోడ్లు ఉన్నాయన్నారు. కనుక కేంద్ర వెంటనే స్పందించి నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు మద్దతు పలికిన వారిలో యూనియన్ నాయకులు శివ, హరి కృష్ణ తదితరులు ఉన్నారు.




# కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం



**చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక) ఫిబ్రవరి 12** కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఘనంగా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ శాఖాలో నాలుగు అధ్యాయాల ప్రారంభం అయింది. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో విజయవంతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాలు, నూతన టెక్నాలజీలపై విశేష అవగాహన కల్పించారు. ఈ క్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డా. సునీల్ రాజ్ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ యొక్క ఔన్యత్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. డా. సుధాకర్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... పిల్లలు మార్కుల కోసం తపనే కాకుండా కో కరికులర్ అంశాల్లో చురుగ్గా పాల్గొని తమ కొత్త పరిశోధనలు చేయాలయని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. వి. జయప్రకాశన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ , హైదరాబాద్ సెక్షన్, డా. చెన్నం హరనాథ రెడ్డి , ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అనంతపురం సబ్ సెక్షన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథి డా.హరినాథ్ రెడ్డి హాజరైన విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగాలు అధ్యాయాల ప్రస్తుత కాలంలో ఎంత అవసరమో తెలియచేశారు. ముఖ్య అతిథి జయప్రకాశన్ మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ కమ్యూనికేషన్ గురించి టెక్నికల్ టాక్లో తెలిపారు.ఈ కార్యక్రమంలో డా. జి . ఎన్ కోదండ రామయ్య ఆర్ & డి డైరెక్టర్ ఈ.సీ.ఈ విభాగాధిపతి, ఐఈఈఈ కోఆర్డినేటర్లు డా. రాసదొరై, డా. అజయ్ కుమార్ రెడ్డి, వివిధ విభాగాధిపతిలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు

సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు.

**నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు ఉద్యమాలు ఉధృతం చేస్తాం.**

**8గంటల పని విధానాన్నే అమలు చేయాలి.**

**స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.**

**బేతంచెర్ల, రంగాపురం లోని అన్ని బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ ఆఫీసులను మూసివేయించిన ఏఐటియుసి, సీపీఐ నాయకులు**




**బేతంచెర్ల ఫిబ్రవరి12 ( నందిపత్రిక).** భారతదేశ వ్యాప్తంగా కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్న, ఏఐటియుసి మండల కార్యదర్శి తాలూకా తిరుమలేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సూర్యచంద్ర, మహాలక్ష్మి, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.నాగరాజు ల ఆధ్వర్యంలో, సీపీఐ కార్యాలయం నుండి ఎస్బిఐ బ్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక హక్కులకు ప్రమాదంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, నూతన జి.రామ్.జి పథకాన్ని రద్దుచేసి పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, అంగన్వాడి, ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని, వారిడిమాండ్లనుపరిష్కరించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, స్టీల్, రైల్వే, పోస్టల్ సంస్థలను కాపాడాలని, దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా బేతంచెర్ల, రంగాపురం లోని అన్ని బ్యాంకులను, ప్రైవేట్ ఫైనాన్స్ ఆఫీసులను మూసివేసి సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమ్మెలో ఏఐటీయూసీ, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు, మహిళా సమాఖ్య నాయకులు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ఎర్రగుడి రాముడు, ఉదయ్, కోన రామకృష్ణ, నాగేశ్వరరావు, సోమన్న, శ్రీరాములు, నాగేష్, తిమ్మయ్య, పుష్పవతి, రామాంజనమ్మ, రమాదేవి, నాగేంద్రమ్మ, మధు, ఎల్లకృష్ణ, రవి, ఖదీర్, దేవరాజు, పెంచలయ్య, సుబ్బరాయుడు, రాముడు, శ్రీమన్నారాయణ, మరియు కార్మికులు కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చుంచులూరు ఉన్నత పాఠశాలలో శుభ దిన్ భోజన్ కార్యక్రమం.



**మర్రిపాడు ఫిబ్రవరి 12నంది పత్రిక :** చుంచులూరు ఉన్నత పాఠశాలలో శుభ దిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన తిరుపతి లోని బాలాజీ టింబర్స్ అధినేత కంచి రాము పుట్టినరోజు సందర్భంగా వారి కుమార్తె మన్విత,అల్లుడు రాగదీప్ లు విద్యార్థులకు రుచికరమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్నా.సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె ర్యాలీ, బహిరంగ సభ విజయవంతం, వేలాదిగా పాల్గొన్న కార్మికులు







## నాలుగు లేబర్ కోడ్ లను, జి.రాం.జీ. చట్టాన్ని ఉపసంహరించుకునే అంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తాం - కార్మిక సంఘాలు

నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 12. (నంది పత్రిక ):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను అమలు చెయ్యాలని, మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం యధావిధిగా అమలు చేసి 200రోజులు పని కల్పించి, 600 రూపాయలు కూలి వేతనం ఇవ్వాలని,జి.రాం.జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎరువుల ధరలను తగ్గించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,వడ్డీ లేకుండా బ్యాంకులలో రుణాలు ఇవ్వాలని కోరుతూ దేశవ్యాప్తంగా యావత్ కార్మిక వర్గం చేపట్టే ఫిబ్రవరి 12న జాతీయ సమ్మెలో కలిసి ఐక్యంగా పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు కనువిప్పు కలగాలని ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో సిఐటియు, ఏఐటియుసి,×ఖీఖ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో టేక్కె మార్కెట్ యార్డ్ నుండి బయల్దేరి పద్మావతి నగర్, శ్రీనివాస్ సెంటర్, కల్పనా సెంటర్ మీదుగా గాంధీ చౌక్ చేరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు చౌడప్ప రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు,సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి. లక్ష్మణ్, బాలవెంకటే,సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మురళి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షులు భూమని శ్రీనివాసులు,ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం నిర్మలమ్మ, జిల్లా నాయకులు డి. నిర్మలమ్మ, రమణమ్మ, కరీమున్నిసా, మదార్ బీ, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గంధం రమణకుమారి,జిల్లా నాయకురాలు శివమ్మ, షమీమ్, తిరుపాలమ్మ, శివలక్ష్మి, సుభద్ర, సుజాత, భ్రమరాంభిక లతో పాటు సీఐటీయూ గా 1500మంది కి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం గాంధీ చౌక్ సెంటర్లో జరిగిన బహిరంగ సభ కార్యక్రమానికి సిఐటియు అధ్యక్షులు కే మహమ్మద్ గౌస్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షత వహించడం జరిగింది.అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు చౌడప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు 10 లక్షల కోట్లకు పైగా రాయితీలను ఇచ్చి పేద ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించిందని ముఖ్యంగా బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడలుగా కుదింపు చేసి పరిశ్రమల యాజమాన్లకు కార్మికులను నయా బానిసలుగా చేసే విధంగా నాలుగు లేబర్ కోర్స్ ఉన్నాయని వాటి వలన కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేదని ముఖ్యంగా సమ్మె చేసే హక్కు కోల్పోవడం జరుగుతుందని యాజమాన్లు ఇచ్చింది తీసుకోవాలి అదనంగా పని గంటలు పెంచేలా వేతనాలను యాజమాన్ల కు నచ్చే రీతిలో ఇచ్చే పద్ధతిని అవలంబిస్తుందని యాజమాన్లకు నచ్చకపోతే కార్మికులను ఉద్యోగం నుండి తొలగించవచ్చని కార్మిక శాఖ కూడా ఏమి చేయలేదని వారికి ఎలాంటి అధికారాలు లేకుండా చేసిందని కార్మికులను రోబోలుగా చిత్రికరించే ప్రయత్నం చేస్తుందని, ప్రపంచ దేశాలు సైతం ఎనిమిది గంటల పని విధానాన్ని అనుసరిస్తుంటే మన దేశంలోని కార్మికులు మాత్రం 13 గంటలు పాటు పనిచేయాలని చట్టాన్ని తీసుకురావడం చాలా దుర్మార్గమని ఈ చట్టం ద్వారా కార్మికులు మరింతగా నష్టపోయి జీవచ్ఛవాలుగా మిగిలే అవకాశం ఉందని అన్నారు.మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం యధావిధిగా అమలు చేసి 200రోజులు పని కల్పించి, 600 రూపాయలు కూలి వేతనం ఇవ్వాలని,జి.రాం.జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎరువుల ధరలను తగ్గించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,వడ్డీ లేకుండా బ్యాంకులలో రుణాలు ఇవ్వాలని దేశవ్యాప్తంగా సమ్మె జయప్రదం చేశారని రాబోయే కాలంలో కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యావత్ కార్మిక వర్గం అంతా పాల్గొని కేంద్రం మెడలు వంచి కార్మిక వర్గం సత్తా చూపించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**సార్వత్రిక సమ్మెకు సిపిఎం, సిపిఐ మద్దతు.** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ర్యాలీలో పాల్గొని, గాంధీచౌక్ సెంటర్లో జరిగిన మద్దతు తెలిపేందుకు బహిరంగ సభ లో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు విచ్చేసి మాట్లాడుతూ గత 12 సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఉద్యోగులకు ప్రజలకు అవసరమైనటువంటి విధానాలను ఏ విధంగా తొలగించాలి ఇబ్బందులకు గురిచేయాలి తన అనుమాయులైన అంబానీ, ఆదానీలకు, విదేశీ సంస్థలకు ఏ విధంగా లాభాలు చేకూర్చాలని పనిలో నిమగ్నమై నాలుగో లేబర్ కోర్టులను తీసుకువచ్చి కార్మికులను నయా బానిసలుగా చేయడం సరైనది కాదని వెంటనే నాలుగు లేబర్ కోర్టులను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు జరిపేలా చూడాలని అదేవిధంగా భారతదేశ జాతిపిత అయిన మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ చట్టం లో తొలగించాలని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వెంటనే ఉపాధి హామీ పథకాన్ని గతం కన్నా మెరుగ్గా నిర్వహించేందుకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని గ్రామీణ ప్రాంతాన్ని నిరుద్యోగం నుంచి కాపాడాలని కోరారు వెంటనే జిరాంజి చట్టాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు

అదేవిధంగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను సరుకులు అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తినాలన్న కొనాలన్నా చాలా భయాందోళనకు గురవుతున్నారని కనీస వేతనాలు రావడం లేదు సరుకుల ధరలు వస్తువుల ధరలు భారీగా పెరిగిపోతున్నాయి అని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందుతుందని, కోట్లాదిమంది కార్మికులు ఉద్యోగులు ప్రజలు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని ప్రభుత్వం పైన ఉన్న వ్యతిరేకతను చాటినందుకు చాలా సంతోషంగా ఉందని, ఇదే ఐక్యతను రాబోయే కాలంలో చాటి చెప్పాలని అన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కారం చేయకుంటే రాబోయే కాలంలో యావత్ కార్మిక వర్గం అంత చేపట్టే ఉద్యమానికి వామపక్ష పార్టీలుగా మద్దతు తెలపడమే కాకుండా ప్రత్యక్ష ఆందోళనలో పూనుకుంటామని మోడీ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించి వేసేలా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పోరాటాలలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు.

# మహాశివరాత్రికి ఓంకారంలో ఏర్పాట్లు





బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 12: మహాశివరాత్రి సందర్భంగా బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార పుణ్యక్షేత్రంలో భక్తులకు వసతులు కల్పించే విషయంలో దేవస్థానం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్షేత్రం పూర్వాపరాలను పరిశీలిస్తే, ఓంకార పుణ్యక్షేత్రం మహా మహిమాన్వితమైన అతి పురాతన క్షేత్రం ఇక్కడ ఓం అన్న ప్రణవనాదం వినిపించుట వల్ల ఓంకార క్షేత్రం గా ప్రసిద్ధి చెందిందని నానుడి. ఈ క్షేత్రము మహా మహిమాన్వితమైన సిద్దుల వల్ల తపస్సు చేసిన కారణంగా స్వామివారు స్వయంభుగా వెలసినారని, అందులకు స్వామివారు శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామి వారిని నామధేయము వచ్చినదని లోకపశస్తి.ఈ క్షేత్రము నందు వ్యాస మహర్షి తపస్సు చేసినారని నానుడి. శ్రీ ఆంజనేయ స్వామికి ఎదురుగా పంచ బుగ్గల కోనేరులో స్నాన మాచరించి ముమ్మారు భక్తిశ్రద్ధలతో పూజించిన వారికి భూత పిశాచాది గ్రహదోషములు దైవానుగ్రహంతో తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామిని ఉమాదేవిని భక్తిశ్రద్ధలతో మనసా వాచా ప్రార్థించిన వారికి సంతానము లేని వారికి సంతానము, దరిద్రులు భాగ్యవంతులైన తార్కానములు కలవు. ఇందుకు నిదర్శముగా మంటపములో కట్టించిన వారు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ క్షేత్రము ఉష కాలమందు ప్రకృతి రమణీయతతో ఆహ్లాదకరంగా ఉంటుంది. స్వామి క్షేత్రంలో ఉన్న పుట్ట నుండి వెలుగు వచ్చి శ్రీ ఉమా సమేత సిద్దేశ్వరులకు అర్పించి పుష్కరినిలో అంతర్ధానం కావడం ఓంకార నాదం వినిపించడం 40 సంవత్సరముల క్రితం జరిగిన ఒక భక్తునికి స్వానుభవం. సిద్ధము నులు స్వామివారిని సేవిస్తారు అని చెప్పుటకు ఇది ప్రత్యక్ష నిదర్శనం. ఎంతో మహిమ కలిగిన ఈ పుణ్యక్షేత్రంలో శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని పరిసరాలను పరిశుభ్రం చేసే పనులకు పూనుకుంటున్నారు. ఆలయం పరిసరాల్లో ఉన్న కోనేరులో పూడికతీత పనులను ముమ్మరంగా చేస్తున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా కోనేరు పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రం చేసే విషయంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.ఆలయానికి సంబంధించిన గుడి గోపురాలకు అందంగా రంగులు వేసే పనులను చేపడుతున్నారు. శివరాత్రి సందర్భంగా నిర్వహించే ఎద్దుల పోటీలకు అవసరమయ్యే స్థలాలను బుల్డోజర్లు తెప్పించి చదును చేయుస్తున్నారు. మహిళలకు ఏర్పాటుచేసిన తాత్కాలిక మరుగుదొడ్లను పరిశుభ్రం చేయిస్తున్నారు. మండల తాసిల్దార్ పద్మావతమ్మ ఓంకార పుణ్యక్షేత్రాన్ని సందర్శించి క్షేత్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్, చైర్మన్ అల్లే చెన్నారెడ్డి తో పాటు దేవస్థానం మండలి సభ్యులు అర్చకులు క్షేత్రములో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. పుణ్యక్షేత్రాన్ని అందంగా ముస్తాబు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.



## పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొని యువతి మృతి రెండేళ్ల తరవాత జాహ్నవికి భారీ పరిహారం

అమెరికాలో ఓ బాద్యత గల పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో మరణించిన కర్నూలు యువతి కందుల జాహ్నవి(23) అనే యువతి కుటుంబానికి న్యాయం జరిగింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారిని విధులనుంచి తొలగించడంతో పాటు మృతురాలు కుటుంబానికి అక్కడి ప్రభుత్వం రూ.262 కోట్ల భారీ పరిహారాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి పై చదువుల కోసం అమెరికా వెళ్లింది. 2023 జనవరిలో సియాటెల్ నగరంలో రోడ్డు దాటుతున్న జాహ్నవిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన డేనియల్ అడరర్ అనే పోలీసు అధికారి కనీసం బాధ్యతగా ప్రవర్తించక పోగా ఎగతాలిగా మాట్లాడారు. ఆమె చనిపోయింది,

ఆమె చాలా మాములు మనిషి, 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది హహహ ' అంటూ ఎగతాలిగా మాట్లాడాడు. కారుతో ఢీకొట్టి కనీసం పాశ్చాతాపం లేకండా వెకిలిగా ప్రవర్తించిన అధికారిపై సియాటెల్ నగర యంత్రాంగ చర్యలు తీసుకంది

# లేబర్ కోడ్ రద్దుకై సిఐటియు డిమాండ్




బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 12: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని బండి ఆత్మకూరు మండలంలో గురువారం సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. నాలుగు లేబర్ కోట్స్ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జి.రాంజీ చట్టాన్ని రద్దుచేసి 2005 మాత్మ గాంధీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కౌలు రైతులకు అన్ని రకాల పంటలకు మద్దతు ధర వచ్చే విధంగా పార్లమెంటులో చట్టం తీసుకొని రావాలని విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించరాదని అమెరికాతో వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని దేశం కోసం ప్రజల ప్రయోజనాల కోసం సిఐటియు దేశవ్యాప్త సమ్మె నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. సమ్మెలో సిఐటియు జిల్లా నాయకుడు రత్నమయ్య సిఐటియు మండల నాయకుడు రాజు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ మండల నాయకుడు రామచంద్రుడు అంగన్వాడి యూనియన్ నాయకురాలు వెంకటరమణమ్మ, శ్యామలమ్మ,ఆశా యూనియన్ నాయకులు సుశీలమ్మ,భాగ్యమ్మ, సువర్ణమ్మ,సంఘం నాయకుడు స్రవంతి సుబ్బరాయుడు, శిరోమణి స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకులు ఖాదరయ్య, శీను ,ఆటో యూనియన్ నాయకుడు ఏసన్న, రాజు రైతు సంఘం నాయకుడు లింగన్న, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో బండి ఆత్మకూరు బస్టాండ్ నుండి తాసిల్దార్ ఆఫీస్ వరకు భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్వాడీలు ఆశాలు మధ్యాహ్న భోజన కార్మికులు స్వచ్ఛభారత్ కార్మికులు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు



## శివరాత్రికి ముందు ఆలయ శుద్ధి : రేంచర్ల నాగేంద్రుడు





సిరివెళ్ల (నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని నల్లమల అడవిలో గల సర్వ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయాన్ని ఆలయ పరిసరాలను పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టామని టిడిపి యువ నేత రేంచర్ల నాగేంద్రుడు మరియు చిన్న పేర్కొన్నారు. శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం రాజరాజేశ్వరి గ్రూప్ సేవాసమితి వారు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులలో భక్తితో పాటు పరిశుభ్రత ముఖ్యమని భావించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్న సదుద్దేశంతోనే ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సాయి జయ చంద్రారెడ్డి, నాగేంద్ర, చిన్న, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వైద్య శిబిరాలకు మందులు పంపిణీ -మారుతి కుమార్




నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 12 . (నంది పత్రిక ):ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు అన్ని శైవక్షేత్రాలలో గత 25 సంవత్సరాలుగా ఉచిత ప్రాథమిక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న విషయము అందరికీ తెలిసిందే.అందులో భాగంగా గత మూడు సంవత్సరాల నుండి కాత్యాయని మెడికల్స్ మరియు సెవెన్ హిల్స్ హాస్పిటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ మాజీ వైస్ చైర్మన్ ఆర్ మారుతి కుమార్ దాదాపు 50 వేల రూపాయల విలువైన మందులను రెడ్ క్రాస్ సొసైటీ కు విరాళంగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మారుతి కుమార్ కి రెడ్ క్రాస్ జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల కోశాధికారి నాగేశ్వరరావు బండి ఆత్మకూరు మండలం రెడ్ క్రాస్ నాయకులు షరీఫ్ శ్రీనివాసులు బనగానపల్లె రెడ్ క్రాస్ సెక్రెటరీ అమీర్ భాష, మహానంది మండల రెడ్ క్రాస్ నాయకులు రాంప్రసాద్, కమలాకర్ నాయుడు, మద్దిలేటి, స్వాములు, గడివేముల రెడ్ క్రాస్ సభ్యుడు శ్రీధర్ రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదం 11 తాటాకు పూరిళ్లు దగ్ధం

మామిడికుదురు మండలంలోని ఆల్ క్యాస్ట్ కాలనీలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 11 తాటాకు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం వల్ల 13 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మరికొన్ని ఇళ్లకు మంటలు వ్యాపించకుండా త్వరితగతినే మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో 13 కుటుంబాలకు చెందిన విలువైన గృహోప కరణాలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఓ వ్యక్తి గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రస్తుతం ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పరిహారం, పునరావాసం కోసం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

# కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్లు రద్దు చేయాల్సిందే.







**కనీస వేతనం నెలకు 26 వేలు రూపాయలు ఇవ్వాలి.**

**రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.**

**విత్తన విద్యుత్ చట్టాలను రద్దు చేయాలి.**

**నూతన కౌలు చట్టాన్ని అమలు చేయాలి.**

**విబి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను పునరుద్ధరించాలి.**

బేతంచెర్ల ఫిబ్రవరి 12 ( నందిపత్రిక). -సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ-బహిరంగ సభ. సంఘటిత అసంఘటిత కార్మిక రంగాలలో పనిచేసే కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలను అమలు చేసి కార్మిక హక్కులను కాలరాసే దుర్మార్గమైన లేబర్ కోడ్లు రద్దు చేయకపోతే పాలక ప్రభుత్వాలకు కార్మిక సంఘాలు కలిసి గోరి కట్టడానికి సిద్ధంగా ఉన్నామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎం మధు శేఖర్, పాలక ప్రభుత్వం హెచ్చరించారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా బేతంచెర్ల పట్టణంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, సహాయ కార్య దర్శి వేణుగోపాల్, ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ నుండి పాత బస్టాండ్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం కొత్త బస్టాండ్ ఆవరణంలో సిఐటియు సహాయ కార్యదర్శి ఎస్ కాజా బాషా, లారీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బి రామాంజనేయులు,ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఏ మద్దిలేటి స్వామి అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ఈ బహిరంగ సభను ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మధు శేఖర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, జిల్లా నాయకులు ఆటో మద్దిలేటి, లారీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బి.రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పి రామ్మోహన్, అంగన్వాడి మండల కార్యదర్శి ఎం కె నాగలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్ కే భాష మాట్లాడుతూ శతాబ్ద కాలంగా బ్రిటిష్ పరిపాలనలో కార్మికులంతా ఏకమై పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం నాలుగు లేబర్ కోడ్లు గా చట్టాలను అమలు చేయడం దుర్మార్గమని వారన్నారు. అంతేకాకుండా దేశంలో వెనుకబడిన రాష్ట్రాలలో పనులు లేక అర్దాకలతో అలమటిస్తున్న కూలీలకు ఉపాధి కల్పించాలని పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షల మంది కూలీలకు వారి వారి రాష్ట్రాలలో ఉపాధి దొరుకుతూ ఉండగా వారు ఆ పనులను చేసుకొని కుటుంబాలను పోషించుకుంటూ ఉండే విధంగా భారత రాజ్యాంగంలో చట్టాన్ని అమలు చేసుకున్నా ఉపాధి పథకాన్ని వి బి జి రామ్ జి అని పేరును అమలు చేసి భారత స్వాతంత్ర పోరాటంలో అలుపెరుగని శాంతియుత పోరాటయోధుడు మహాత్మా గాంధీని నిర్దాక్షణంగా కాల్చి పొట్టన పెట్టుకున్న గాడ్సే పేరును పెట్టడం ఎంత దుర్మార్గానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం తెరలేపిందో కార్మికులు ప్రజలు మేధావులు ఆలోచించాలని వారన్నారు. రైతు సంఘం నాయకులు రామ్మోహన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకపోగా రైతులు వారి వారి పొలాలలో ఏ పంట వేసుకోవాలి ఏ పంటను ఏ విధంగా అమ్ముకోవాలి అనే దుర్మార్గమైన ఆంక్షలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం రైతు పట్ల వ్యవసాయ కూలీల పట్ల నిరంకుశ ధోరణి తో వ్యవహరించడం సరైనది కాదని ప్రజాస్వామ్యం గల ఈ దేశంలో రైతులు పండించిన పంటలకు, కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేసి పంటలను ప్రభుత్వమే రైతుకు న్యాయం జరిగే విధంగా కొనుగోలు చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. స్కీం వర్కర్లు అంగన్వాడీ నాగలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు నాగేంద్రమ్మ మాట్లాడుతూ కార్మికులు రక్తం ధారబోసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మూలం చేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమని అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్కీం వర్కర్లకు అనగా అంగన్వాడి ఆశ మిడ్ డే మీల్స్ మున్సిపాలిటీ కార్మికులకు ఒక్క పథకం కూడా వర్తింప చేయకుండా జీవోలు జారీ చేయడం కార్మికులను బానిసలుగా మార్చే విధానానికి నిదర్శనమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయకపోతే భవిష్యత్తులో కార్మిక రంగాలతో పాటు ప్రజా సంఘాలు ప్రభుత్వ ఉద్యోగులను ప్రైవేటు ఉద్యోగులను కలుపుకొని అలుపెరుగని ఉద్యమ పోరాటాలు చేస్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్ రహమతుల్లా, వైబి వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, ఎర్రమల, లక్ష్మణ్, కిరణ్, నరసింహ, రాముడు, సుబ్బరాయుడు పూసల వెంకటరమణ,అంగన్వాడి పట్టణ కార్యదర్శి ఎస్ గుల్జార్బి, ఆశా వర్కర్స్ యూనియన్ సుజాత, పుష్ప లత, రంగాపురం రాజేశ్వరి, వరాలమ్మ, మధురవాణి, శ్రీదేవి, కళావతి, రమాదేవి, అనూష, లావణ్య, సరోజ, వెంకటస్వామి, రామచంద్రుడు, ఆటోభాస్కర్, పుల్లయ్య, స్వామి నాయుడు, వెంకటేష్ నాయక్, రంగాపురం హమాలి తిమ్మయ్య, మల్లికార్జున, చక్రవర్తి, శీల న్న, సిహెచ్ మద్దిలేటి స్వామి, కృష్ణన్న, టింగు, నాగరాజు, పెద్ద నరసింహులు, వెంకటేశ్వర్లు, రషీద్, లోకేష్, మద్దిలేటి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీశైలంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కురువ సంఘం.



నంది పత్రిక గడివేముల శివరాత్రి సందర్భంగా శ్రీశైలంలోని శ్రీ శ్రీ శ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్న దాన సత్రం కమిటీ నిర్వాహకులు అధ్యక్షులు ఎంకే రంగస్వామి, ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పర్ల శ్రీనివాసులు, సభ్యులు కేసి నాగన్న, కె నాగశస్సులు, జి శివన్న, వెంకటేశ్వర్లు, లు గురువారం నాడు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. శివరాత్రి పండగ మహోత్సవాలసందర్భంగా ఐదు రోజులు నిర్వహించే ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని పర్ల గ్రామానికి చెందిన మల్లికార్జున, నాగన్న, రాముడు ,బృందం వారు అన్నదానం కోసం ఎంతో సహకరించాలని వారు తెలిపారు. అలాగే మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి చెందిన కే దేవా రెడ్డి అనే వ్యక్తి కూడా ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించాలని వారు తెలిపారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తాదులకు శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్నదాన సత్రంలో నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా వినియోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని సత్రం కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంకే రంగస్వామి, ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పర్ల శ్రీనివాసులు, సభ్యులు కేసి నాగన్న ,కె నాగశేషులు, జి శివన్న ,వెంకటేశ్వర్ల, తో పాటు కురువ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు, సత్రం సభ్యులు తిమ్మయ్య, హరికృష్ణ, సుబ్బయ్య,మరియు కురువ కుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.ట

# రహదారి శిధిలం - ప్రయాణికులకు శాపం

## అడుగడుగున అడుగు లోతు గుంతల మయం





శిరివెళ్ల :-(నంది పత్రిక) వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న గ్రామాలకు గుంతల మయంగా మారిన రహదారి ప్రతిబంధకాలు సృష్టిస్తోంది. సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలతో పాటు మహిళా చైతన్యం వెల్లి విరుస్తున్న గ్రామాలకు ప్రధాన రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణం నరక కూపంగా మారిందని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఉపాధ్యాయులు రోగులు, గర్భిణీ బాలింత మహిళలు అత్యవసర చికిత్స కోసం వెళ్లే ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న సంఘటన శిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె కోటపాడు గ్రామాల రహదారి నిదర్శనంగా మారింది. శిరివెళ్ల మండల కేంద్రం నుండి గోస్పాడు,కోవెలకుంట్ల, దోర్నిపాడు బనగానపల్లె తదితర మండలాల పరిధిలోని గ్రామాలకు వెళ్లే ఆర్ & బి రహదారి వీరారెడ్డిపల్లె మరియు కోటపాడు గ్రామాల పరిధిలో అధ్వానంగా మారిందని, శిధిలావస్థకు చేరి గుంతల మయంగా మారిన రహదారిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని రెండు గ్రామాల ప్రజలు ప్రయాణికులు పేర్కొన్నారు. రహదారి మరమ్మత్తులు చేయాల్సిన పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని వృద్ధులు వికలాంగులు ఈదారి పై వెళ్లాలంటే అనారోగ్యానికి గురవుతున్నట్లు అత్యవసర వాహనంలో మెరుగైన చికిత్స కోసం పట్టణాలకు వెళ్లాలంటే ఆలస్యం అవుతున్నదని గర్భిణీ బాలింత మహిళల పరిస్థితి వర్ణనాతీతంగా మారిందని పేర్కొంటున్నారు. నిత్యావసర సరుకుల దగ్గర నుంచి వ్యవసాయ పంటల కోసం ఎరువులు కొనుగోలుకు ప్రతి అవసరం కోసం పట్టణాలకు మండల కేంద్రానికి విద్య వైద్య అవసరాలకు ప్రయాణం చేయాల్సిన రహదారి అడుగడుగునా అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయని వాహనాలు మరమ్మత్తులకు గురి అవుతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండెపోటు సంభవించిన రోగులను అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం పట్టణాలకు తరలించే క్రమంలో మార్గమధ్యంలోనే గుంతల కారణంగా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి శిథిలమైన రహదారిని పూర్తిగా తొలగించి నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు.

# యురేకా సైన్స్ ఎక్స్‌పో2026 వీడియో పోటీలు





**మార్చి 8 వరకు ఎంట్రీలకు అవకాశం**

**రాష్ట్రవ్యాప్తంగా యురేకా సైన్స్ ఎక్స్‌పో పోటీలు జెవివి ప్రకటన**

కాశినాయన ఫిబ్రవరి 12 (నంది పత్రిక):సైన్స్ మాసం ఫిబ్రవరి సందర్భంగా నాలుగు సంవత్సరాలుగా సైన్సు ప్రయోగాల వీడియో పోటీలు నిర్వహిస్తున్న జెవివి ఈ సంవత్సరం కూడా రాష్ట్ర వ్యాప్త వీడియో పోటీలు నిర్వహించబోతోందని జెవివి జిల్లా కార్యదర్శి ఖాసీం వల్లి గురు వారం జెడ్ పి హెచ్ ఎస్, నరసాపురం నందు జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో తెలిపారు.జెవివి కాశినాయన అధ్యక్షులు చంద్ర శేఖరాచారి మాట్లాడుతూ... ఈ యురేకా సైన్స్ ఎక్స్ పో పోటీలు వల్ల విద్యార్థుల లో నైపుణ్యాభివృద్ధి, సైన్స్ సిద్ధాంతాలను మెరుగ్గా అర్థం చేసుకుంటారని, చదువులో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఇన్నోవేషన్-టెక్నాలజీ, పర్యావరణం-వ్యవసాయ రంగం, అపోహలు- శాస్త్రీయ వివరణ లాంటి అంశాలపై విద్యార్థులు వీడియోలు చేసి గూగుల్ ఫామ్ లింక్ ద్వారా మార్చి 8వ తేదీ లోపల పంపాలన్నారు. అయితే ఈ పోటీలలో పాల్గొనే 8,9,10 విద్యార్థులందరూ యూ పి ఐ ఐడీ ద్వారా యాభై రూపాయలు ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. జెవివి జిల్లా కార్యదర్శి ఖాసీం వల్లి మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ పోటీలు వేరు వేరుగా ఉంటాయన్నారు. "లో కాస్ట్..నో కాస్ట్" లో చేసిన ప్రయోగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఒక వీడియో లో గరిష్టంగా ముగ్గురు మాత్రమే పాల్గొన వచ్చన్నారు. ఒక విద్యార్థి 3 థీమ్ లలో పాల్గొన వచ్చని, అయితే ప్రతి థీమ్ కి రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీడియో నిడివి గరిష్టంగా 5 నిముషాలు మించకూడదన్నారు. యురేకా సైన్స్ ఎక్స్ పో -2026 సైన్స్ పోటీలలో ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం లో చదువుకున్న 8,9,10 తరగతుల్లో చదివే ప్రతి విద్యార్థిని ఈ పోటీలలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. ప్రతి జిల్లాలో ప్రతీ థిమ్ లో మొదటి, ద్వితీయ బహుమతులు ఉంటాయని, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొందిన వీడియో రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతుందని, రాష్ట్ర స్థాయిలో ప్రతీ థిమ్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుంటాయన్నారు. మార్చి 28వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఈ-సర్టిఫికెట్స్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలిరెడ్డి,సైన్సు ఉపాధ్యాయులు సుబ్బా రెడ్డి,రాజ కుమారి,ఉపాధ్యాయులు తమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ మోసాలు లావాదేవిలపై అప్రమత్తంగా ఉండాలి



కొత్తపల్లి - నంది పత్రిక : ప్రతి ఒక్కరు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న డిజిటల్ మోసాలు, లావాదేవిలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిట్రసీ కేంద్ర కౌన్సిలర్లు రాజు, శివనాగరాజులు సూచించారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా ఉపాధి వేతనదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్పై, గూగుల్పే, పేటీయం, ఇతర బ్యాంకు ఆన్లైన్ డిజిటల్ లావాదేవిలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్ పట్ల కూడా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా కేవైసీ, సీకేవైసీ ల ప్రాముఖ్యతను బ్యాంకు ఖాతాదారులకు వివరించారు. దీంతో పాటు అటల్ పెన్షన్ యోజన, ప్రదానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రదాన మంత్రి సురక్ష బీమా యోజన, ఆయుస్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ఇన్సురెన్స్ లపై ప్రజలకు అవగాహన కల్పించారు. అజ్ఞాత వ్యక్తులు విద్యార్థులను, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్ కుమార్ తదితరులుపాల్గొన్నారు.



# అన్న క్యాంటీన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి





భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 నంది పత్రిక భీమవరం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నా క్యాంటీన్ లు ద్వారా ప్రభుత్వం పేద ప్రజలకు ఐదు రూపాయలకే నాణ్యతతో రుచికరమైన భోజనమును ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో వాష్ ఏరియా, సర్వింగ్ ఏరియా, త్రాగునీటి సదుపాయం, భోజన పంపిణీ విధానం పరిశీలించారు. వాష్ ఏరియా, ఆహారం భుజించే ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆహారం వడ్డించేవారు విధిగా గ్లవ్ జులు, హెడ్ క్యాప్ లు ధరించాలన్నారు. క్యాంటీన్ లో భోజనం చేస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఆహారం పరిమాణం, సేవలుపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించిన సహించబోమని హెచ్చరించారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని క్యాంటీన్ పరిసరాలు ఎల్లప్పుడూ శు భ్రంగా ఉంచాలని చేతులు కడుక్కోవడానికి సరైన సౌకర్యాలు ఉండాలని సూచించారు. త్రాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అన్న క్యాంటీన్ పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తమైన పథకమని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని అన్నారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన భోజనం అందించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ డిఈ తాత బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నులి పురుగుల నిర్మూలనకు 1 టు 19 వయసు కలిగిన పిల్లలందరికీ ఆల్బెండజోల్ తప్పనిసరిగా టాబ్లెట్లు అందించాలి

## అంగన్వాడి సిబ్బంది చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 నంది పత్రిక**

జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఫిబ్రవరి 17న 3,793 విద్యాసంస్థలలోని అంగన్వాడి, పాఠశాలల, కళాశాలలు, బడి బయట పిల్లలు మొత్తం 3,51,125 మంది బాలల లక్ష్యంగా ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్య శాఖ అధికారులు ఆదేశించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార లోపాన్ని తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1- 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు మరియు కిశోరు బాలలకు అల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. వీరితోపాటు వివిధ ఫ్యాక్టరీలలో, ఆక్వా రంగంలో, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఉంటున్న పిల్లలను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించి నులిపురుగుల నివారణ టాబ్లెట్ ను తప్పకుండా అందించాలన్నారు. పిల్లలలో రక్తహీనత, పోషకాహార లోపం, బరువు తగ్గడం, చదువులో ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలకు నులిపురుగుల నివారణ ద్వారా సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు అమలు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పిల్లలకు మాత్రలను మధ్యాహ్నం భోజనం అనంతరం సురక్షితంగా అందించి, పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం వంటి అలవాట్లపై అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు ఇప్పించేందుకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒకటి, రెండు సంవత్సరాలు వయసు కలిగిన పిల్లలకు సగం టాబ్లెట్ నీటిలో కరిగించి మాత్రమే అందించాలని, ఈ విషయమై అంగన్వాడి సిబ్బంది ప్రత్యేక సర్దు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 17వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు తీసుకొని పిల్లలకు ఫిబ్రవరి 24న అందించడం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వసతి గృహాలలో వంటలు చేసే సిబ్బందికి కూడా వయసుతో నిమిత్తం లేకుండా ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా రెండు రోజులు ముందుగానే జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వారి పరిధిలోని పాఠశాలలలో ఈ కార్యక్రమం నూరు శాతం అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించే తేదీని పిల్లల డైరీలో నమోదు చేసి తల్లిదండ్రులకు తెలిసే విధంగా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నిర్మూల కార్యక్రమంలో భాగంగా రూపొందించిన "ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నులి మేద్దాం.." గోడపత్రికను సమావేశా అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ జి.గీతబాయి, డి సి హెచ్ ఎస్ పి.సూర్యనారాయణ, ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం అధికారి కె.ఎం కిషోర్, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి వై దోసిరెడ్డి, డిపిఓ రామ్ రామనాథరెడ్డి, డీఈవో ఈ నారాయణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అరుణ కుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.వి సూరిబాబు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పుష్ప రాణి, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో పీఎం శ్రీ పథకం క్రింద ఎంపిక చేసిన పాఠశాలలో నిర్వహిస్తున్న పనులను వేగవంతంగా పూర్తి చెయ్యాలి:

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరము నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పీఎం శ్రీ, ఏ డబ్ల్యు పి అండ్ బి, మనబడి మన భవిష్యత్తు పథకాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పిఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాల నందు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ప్రత్యేక మరుగుదొడ్లు, ర్యాంపుల నిర్మాణాలు, తదితర పనులు చేపట్టడానికి 104 పనులను కేటాయించడం జరిగిందని, వీటిలో 42 పనులను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ డబ్ల్యు పి అండ్ బి పథకం 76 పనులను కేటాయించడం జరిగిందని, వీటిలో వివిధ ల్యాబ్లు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే మనబడి మన భవిష్యత్తు పథకం కింద చెరుకువాడ, మొగల్తూరు పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. పనులు చేపట్టిన పిఆర్, ఆర్డబ్ల్యూఎస్, ఏపీ డబ్ల్యూ ఐ డి సి, పీహెచ్డీ, ఎస్ఎస్ఎ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసి పి.శ్యామ్ సుందర్, డిఈ జి.నాగేంద్ర శేఖర్, ఏఈ ఎన్.రమేష్, పిఆర్, ఆర్డబ్ల్యూఎస్, ఏపీ డబ్ల్యూ ఐ డి సి, పీహెచ్డీ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థుల ఆరోగ్య విషయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.



## జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు సంక్షేమ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 నంది పత్రిక** జిల్లాలో సంక్షేమ వసతి గృహాలపై జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థుల ఆరోగ్య విషయాల తనిఖీపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ ఇన్స్పెక్షన్ టీం సభ్యులు ప్రతిరోజు హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి పిల్లల ఆరోగ్య విషయాలు, దినచర్యలపై నివేదికలను అందించాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలలో పారిశుధ్యంపై పిర్యాదు రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా హాస్టల్ లో పారిశుధ్యంపై పిర్యాదు వస్తే సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రమణ వ్యాధులు రోజు రోజుకు పెరిగిపోవడంతో సంక్రమణ వ్యాధులపై రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం వన్ హెల్త్ విధానంలో విభాగాల మధ్య సమన్వయంను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను క్రమం తప్పకుండ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన డిఎం అండ్ హెచ్ ఓ జి.గీతబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం అధికారి కె.ఎం కిషోర్, డిఐఓ డా.దేవ సుధా లక్ష్మి , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డిపిఓ ఎన్.రామ్నాథరెడ్డి, డీఈవో ఇ.నారాయణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణ్ కుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.వి సూరిబాబు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పుష్ప రాణి, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ సమావేశాల వీక్షణకు లిటిల్ ఏంజెల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పిలుపు.



**వెలుగోడు, ఫిబ్రవరి 12 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల వీక్షణకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నుండి ప్రత్యేక అనుమతి లభించడం ఆనందకర విషయమని పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఎఫ్. ఇమ్మానియేల్ చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.పాఠశాల నుండి 32 మంది విద్యార్థులు , 5 మంది ఉపాధ్యాయులు ఫిబ్రవరి 13వ తేదీన జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్షంగా వీక్షించేందుకు విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించే ఈ అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి పాఠశాల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ప్రేరణగా నిలుస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# సైన్స్ ఫెయిర్‌లో చిచ్చర పిడుగుల మెరుపులు విద్యార్థుల ప్రతిభకు ఫిదా అయిన అతిథులు!

## వ్యవసాయం నుండి టెక్నాలజీ వరకు అన్ని రంగాల్లోనూ అదరగొట్టిన నారాయణ స్కూల్ విద్యార్థులు.




**నంద్యాల ఫిబ్రవరి 12 వ్యవసాయ విలేఖరి:-** నారాయణ పాండే హై స్కూల్ ఎన్జీవోస్ కాలనీ నందు స్పార్క్ ఎడ్యుకేషనల్ సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించడం జరిగింది. నారాయణ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ యాకూబ్ కరెస్పాండెంట్ ఇషాక్ వలి ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్ వేర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ హుస్సేన్ భాష ఆపుస్మా డిస్టిక్ ప్రెసిడెంట్ బిజ్జం సుబ్బారెడ్డి అపుస్మా డిస్టిక్ ట్రెజరీ ఎస్ హుస్సేన్ భాష ( సాయి వాణి స్కూల్) పాల్గొనడం జరిగింది కార్యక్రమంలో పాల్గొన్నటువంటి అతిథి అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ హుస్సేన్ భాష మాట్లాడుతూ విద్యార్థులు నిర్వహించినటువంటి ప్రాజెక్టు వర్క్ లో వీక్షించడం జరిగింది. ఈ ప్రాజెక్టు వర్క్ ప్రాజెక్ట్ విద్య వైద్యం ఆధ్యాత్మిక టెక్నాలజీ పర్యావరణ వ్యవసాయానికి సంబంధించిన ఎన్నో రకాలైన ప్రాజెక్టులను విద్యార్థులు చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు వీక్షించినటువంటి అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చూసి మంత్రం ముగ్దలు అయి విద్యార్థులకు 10,000 రూపాయల బహుమతి ప్రకటించడం జరిగింది. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ వి యాకుబ్ గారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రకాల రంగాలకు సంబంధించినటువంటి ప్రాజెక్టులను వీక్షించి విద్యార్థుల ప్రాజెక్టులో సహకరించినటువంటి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అనంతరం విద్యార్థులు విద్యార్థులకు ప్రశంశా పత్రాన్ని మరియు మెడల్స్ బహుమతిగా ఇవ్వడం ఈ కార్యక్రమంలో వికాస్ పాఠశాల కరస్పాండెంట్ వలి నలంద కా రెస్పాండెంట్ ఉత్తేజ్ నవభారత్ పాఠశాల మోహిన్ జివిఆర్ అభ్యుదయ స్కూల్ కరెస్పాండెంట్ హుస్సేన్ వలి మరియు రవి ఆల్ఫా పాఠశాల ఇర్ఫాన్ మరియు నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది




# నారాయణ పాండే హై స్కూల్లో ఘనంగా స్పార్క్ ఎడ్యుకేషనల్ సైన్స్ ఫెయిర్

## -ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 10వేల రూపాయల బహుమతి.



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 12. నంది పత్రిక:** నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ లోని నారాయణ పాండే హై స్కూల్ నందు "స్పార్క్ ఎడ్యుకేషనల్ సైన్స్ ఫెయిర్ 2026" ఘనంగా నిర్వహించడం జరిగింది. నారాయణ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ యాకూబ్, కరెస్పాండెంట్ ఇషాక్ వలి ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.హుస్సేన్ భాష, ఆపుస్మా డిస్టిక్ ప్రెసిడెంట్ బిజ్జం సుబ్బారెడ్డి, అపుస్మా డిస్టిక్ ట్రెజరీ ఎస్.హుస్సేన్ భాష లు (సాయి వాణి స్కూల్) పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్నటువంటి అతిథి అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.హుస్సేన్ భాష ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు నిర్వహించినటువంటి ప్రాజెక్టు వర్క్ లు వీక్షించడం జరిగింది. ఈ ప్రాజెక్టు వర్క్ విద్య, వైద్యం, ఆధ్యాత్మిక, టెక్నాలజీ, పర్యావరణ వ్యవసాయానికి సంబంధించిన ఎన్నో రకాలైన ప్రాజెక్టులను విద్యార్థులు చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు వీక్షించినటువంటి అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చూసి మంత్రముగ్ధులు అయి, విద్యార్థులకు 10,000 రూపాయలు బహుమతిని ప్రకటించడం జరిగింది. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ వి.యాకుబ్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రకాల రంగాలకు సంబంధించినటువంటి ప్రాజెక్టులను వీక్షించి, విద్యార్థులకు ప్రాజెక్టులో సహకరించినటువంటి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంశా పత్రాన్ని మరియు మెడల్స్ బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికాస్ పాఠశాల కరస్పాండెంట్ వలి, నలంద కరెస్పాండెంట్ ఉత్తేజ్, నవభారత్ పాఠశాల మోహిన్, జివిఆర్ అభ్యుదయ స్కూల్ కరెస్పాండెంట్ హుస్సేన్ వలి మరియు రవి, ఆల్ఫా పాఠశాల ఇర్ఫాన్ మరియు నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# పాతబస్తీలో రౌడీ గ్యాంగ్ హల్‌చల్

## వ్యాపారిపై తల్వార్‌తో దాడి

హైదరాబాద్ పాతబస్తీలో రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. తాజాగా కాలాపత్తర్ ప్రాంతంలో రౌడీషీటర్ అసద్, అతని గ్యాంగ్ చేసిన దాడి స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. చట్టాన్ని, పోలీసులను ఏమాత్రం లెక్కచేయకుండా వారు జరిపిన ఈ దాడి దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాతిమా ఆస్పత్రి వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. రౌడీషీటర్ అసద్ తన అనుచరులతో కలిసి ఒక షాప్ యజమానిపై కత్తితో దాడికి తెగబడ్డాడు. షాప్ యజమాని తన మోటార్ సైకిల్‌పై కూర్చుని ఉండగా, అసద్ గ్యాంగ్ ఆకస్మికంగా తల్వార్లతో విరుచుకుపడింది. దాడి చేసిన అనంతరం, వారు షాపులోని ఫ్రిడ్జ్‌ను ధ్వంసం చేశారు. అంతేకాకుండా షాప్ అద్దాలను కూడా పగలగొట్టి హంగామా సృష్టించారు. ఈ ఘటనతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. అయితే, ఈ రౌడీషీటర్ పాత నేరస్తుడని పోలీసులు చెబుతున్నారు. రౌడీషీటర్ అసద్ ఆగడాలపై అప్పటి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గతంలోనే పీడీ యాక్ట్ నమోదు చేశారు. అసద్ నేర ప్రవృత్తిని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు, అతనిపై రాష్ట్ర బహిష్కరణ విధించారు. రాష్ట్ర బహిష్కరణ ఉత్తర్వులు ఉన్నప్పటికీ అసద్ పాతబస్తీలో ఎలా తిరుగుతున్నాడు..?,

# ఒంటరి ఏనుగు సంచారం



**చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక) ఫిబ్రవరి 12** కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం ఓ ఎన్ కొత్తూరు గ్రామ పరిసర ప్రాంతాల సమీపంలో చిగురుకుంటా బంగారు గనుల పరిసర ప్రాంతాలలో ఒంటరి ఏనుగులు సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. గత కొద్దిరోజులుగా ఓఎన్ కొత్తూరు - శ్రీనివాసపురం గ్రామాల మధ్య ఒంటరి ఏనుగులు సంచరిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఏనుగు రోడ్డుపైకి వస్తున్నాడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తమ గ్రామాల వైపు ఒంటరి ఏనుగు రాకుండా అడ్డుకట్ట వేయాలని స్థానికులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు ఒంటరి ఏనుగు తమ గ్రామ రోడ్డు పైకి రాకుండా కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఓంకార్య పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన ఏఎస్పీ జావళి

**బండి ఆత్మకూరు నందిపత్రిక ఫిబ్రవరి 12:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార పుణ్యక్షేత్రాన్ని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ జావళి గురువారం సాయంత్రం సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా పుణ్యక్షేత్రంలో ఏర్పాటుచేసే వసతులను సౌకర్యాలను ఆమె పరిశీలించారు. పార్కింగ్ స్థలాలను కోనేరు పరిసర ప్రాంతాలను ఆమె పరిశీలించడం జరిగింది. భక్తులు స్వామిని దర్శించే సమయంలో ఏర్పాటు చేసే క్యూలైన్లను కూడా ఆమె పరిశీలించారు. కోనేరు ప్రాంతంలో పిల్లలు స్నానం చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకో వాలని పోలీసులకు అడిషనల్ ఎస్పీ జావళి సూచించినట్లుగా తెలుస్తోంది. అడిషనల్ ఎస్పీ జావలి వెంట పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ పద్మావతమ్మ,ఎస్ఐ జగన్మో హన్,వస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగ ప్రసాద్, ఆలయ చైర్మన్ అల్లె చిన్నారెడ్డి అర్చకులు పాల్గొన్నారు



# 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలి 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఏఐటీయూసీ సిఐటియు ప్రజా సంఘాలతో బద్వేల్ పట్టణంలో ఘనంగా నిర్వహణ..

## కనీస వేతనం 26000 రూ.,చట్టం చెయ్యాలి




**బద్వేల్ ఫిబ్రవరి 12నంది పత్రిక:** భారత దేశవ్యాప్తంగా సుమారు 22 కార్మిక సంఘాలు నేడు తలపెట్టిన భారత సార్వత్రిక సమ్మె బద్వేల్ పట్టణంలో ఏఐటీయూసీ .సిఐటియు. ఆధ్వర్యంలో కార్మికులు. ఉద్యోగులు. విఆర్ఏ. అంగన్ వాడీ. ఆశావర్కర్లు .ఎన్జీవో. పెన్షనర్లు. భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్. ఎఐటియుసి ఏరియా కార్యదర్శి పీ.వీ. రమణ. మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ. ప్రైవేట్. రంగాలు లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం 26000 రూ,, నిర్ణయిస్తూ పార్లమెంటులో చట్టం చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. .44 కార్మిక చట్టాలు ఉండగా వీటిని కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా కేవలం 4 చట్టాలుగా మాత్రమే పరిగణిస్తూ చట్టం చేయడం అన్యాయమని ఇది రాజ్యాంగ విరుద్ధమని ఎన్నో పోరాటాలు ప్రాణ బలిదానాల కారణంగా ఏర్పాటైన కార్మిక చట్టాలపై కేంద్ర. రాష్ట్ర. ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపటం పై తీవ్రంగా పరిగణిస్తున్నారని ఇది తీవ్ర రూపం దాల్చకముందే కేంద్ర ప్రభుత్వం 4 కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం అధ్యక్షులు పి.నరసింహారెడ్డి. ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నల్లిపోగు నాగేశం. మల్లి రామకృష్ణయ్య. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి. కళావతి. ఏఐటీయూసీ ఏరియా నాయకులు బాలు ఇమ్మానియేల్ నాగరాజు లారీ యూనియన్ నాయకులు రవీంద్ర రషీద్ కృష్ణ టాటా సుమో యూనియన్ నాయకులు తంబి నాసర్ మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ నాయకులు నరసింహ మల్లికార్జున శ్రీను సిఐటియు జిల్లా నాయకులు కే శ్రీనివాసులు జకరయ్య వెంకటేశు చిన్ని ఈ రమణ ప్రవీణ్ షరీఫ్ పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనడం జరిగింది.




# ఓట్ల లెక్కింపు కేంద్రాల నుండి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు.



**కేసముద్రం, ఫిబ్రవరి 12(నంది పత్రిక):** బుధవారం నిర్వహించిన 2వ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికల లెక్కింపు శాంతియుతంగా, న్యాయపరంగా జరుగుటకు కేసముద్రం మండల తహాశీల్దార్ చే కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపు ముగిసే వరకు 144 సెక్షన్/163 బిఎంఎస్ఎస్ అమల్లో ఉంటుందని కేసముద్రం ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రం నుండి 200 మీటర్ల లైన్ లోపల ఉన్న షాపులను ఎట్టి పరిస్థితులలో తెరవద్దని, ఇండ్లు ఉంటే కుటుంబ సభ్యులు మాత్రమే ఉండాలని, ఎవరూ బయటికి రావద్దని, బయటి రానివ్వడం, గుంపులుగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు, వారి కార్యకర్తలు, ఏ ఇతరులను ఇంట్లో గాని షాప్ లో గాని గుమ్మిగూడనివ్వకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్ చుట్టుపక్కల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎవరి వాహనాలను కూడా మీ ఇంటి ముందు గాని షాప్ ముందు గాని పార్క్ చేసి వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరు ఈ ఆదేశాలను ఉల్లంఘించిన తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోబడునని మార్కెట్ పరిధిలోని ఇండ్లు, షాపుల వారికి పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ నోటీసులని గమనించి అందరూ శాంతి పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. శాంతి భద్రతల కొరకు కేసముద్రం పోలీసు విభాగం 24 గంటలు పర్యవేక్షిస్తుందని, దీనికి ప్రజల సహకరించాలని కోరారు.

# నీటి సరఫరా పైప్ లైన్ లీకేజ్ మరమ్మత్తుల పనులను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ వెంకట్ రామిరెడ్డి.



**నందికొట్కూరు ఫిబ్రవరి 12( నంది పత్రిక)** నందికొట్కూరు పట్టణానికి మల్యాల పంప్ హౌస్ నుండి వచ్చు నీటి సరఫరా పైప్లైన్ లీకేజీ కావడంతో మున్సిపల్ సిబ్బంది మరమ్మత్తుల పనులు చేపట్టారు. మరమ్మత్తుల పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ జి వెంకట రామిరెడ్డి సందర్శించి పరిశీలించారు. పట్టణంలో నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా త్వరితగతిన మరమ్మత్తుల పనులు పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ నాసిర్, ఏఏ దినేష్ కుమార్, మనోజ్ కుమార్ రెడ్డి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామ పంచాయతీని తనిఖీ చేసిన ఎంపీడీవో నూర్జహాన్

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 12 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలంకోట కందుకూరు ఆర్ కృష్ణాపురం గ్రామాలలోని స్వర్ణ గ్రామపంచాయతీ ఆళ్లగడ్డ ఎంపీడీవో నూర్జహాన్ తనిఖీ చేశారు గురువారం నాడు ఆమె స్వర్ణ గ్రామపంచాయతీ తనిఖీ చేసిన అనంతరం మాట్లాడుతూ యు ఎఫ్ ఎస్ సర్వేను అసంతృప్తిగా ఉన్న హౌసింగ్ మంజూరైన ఇండ్లు పూర్తి చేయాలని ఆదేశించారు అనంతరం పలు విషయాలపై సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు అలాగే సిబ్బంది అందరూ సరైన సమయంలో విధులకు హాజరై అటెండెన్స్ వేసి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.



# కార్మిక వ్యతిరేక చట్టాల ఉపసంహరణకు ఐక్య పోరాటాలు నిర్వహిద్దాం.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పిలుపునిచ్చిన నాయకులు.



**కేసముద్రం, ఫిబ్రవరి 12(నంది పత్రిక):** దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం కేసముద్రం మండల కేంద్రంలోని పూలే కూడలిలో తెలంగాణ రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో మోడీ సర్కార్ తెచ్చిన రైతు, కర్షక, కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్ లు విద్యుత్, విత్తన చట్టాలు, వీబీజిరామ్జి చట్టాలను రద్దు చేయాలని నిరసనగా ఆందోళన నిర్వహించారు. అనంతరం హరి హర గార్డెన్ లో ఎండి సలీమ, గౌడిశాల వెంకన్న, నీరుటి జలందర్ ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు, రైతు సంఘం జిల్లా నాయకులు ఆకుల రాజు, మార్తినేని పాపారావు, చాగంటి కిషన్, తాడబోయిన శ్రీశైలంలు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ఆధాని, అంబానీ లకు దేశ సంపదను అయాచితంగా దోచిపెడుతూ కార్మిక, కర్షక, ప్రజల హక్కులు హరించి వేస్తు తెచ్చిన ఆర్డినేన్స్ లను ఉపసంహరించే వరకు ఐక్య పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ, అంగన్వాడీ, ఐకేపీ విఓఏ, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మిక, గ్రామ పంచాయతీ, ఐద్వా, కళ్ళు గీత కార్మిక, కెవిపిఎస్, గిరిజన సంఘాల నాయకులు డి.పుష్ప, ఎం.రజిత, బి.నెహ్రు, మాందాటి కళావతి, ముల్క మురళి, బండి దర్గయ్య, సిహెచ్ సులోచన, అల్లం సురేష్, మోడెం వెంకటేశ్వర్లు, అల్పుగొండ సావిత్ర, సోమారపు ఎల్లయ్య, జి.కేశ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల ద్రోహి నరేంద్ర మోడీ

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంతవరకు పోరాడుతాం సిఐటియు.



**నందికొట్కూర్ ఫిబ్రవరి 12( నంది పత్రిక)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై కక్ష సాధింపు చేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడీ కార్మికుల ద్రోహి అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు అన్నారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడులు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటు పరం ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగ కార్మికులకు భద్రత కల్పించాలని, నరేంద్ర మోడీ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక కొత్త బస్టాండ్ నుండి ర్యాలీగా కార్మికులు కదం తొక్కుతూ నాలుగు లేబర్ కోడులు రద్దు చేసే వరకు పోరాడుతామని కార్మికులు కన్నేర చేస్తూ సార్వత్రిక సమ్మెలో భాగంగాపటేల్ సెంటర్ కు చేరుకొని కేజీ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.పకిరి సాహెబ్, బెస్తరాజు, ఎం కర్ణ, మాట్లాడుతూ, దశాబ్ద కాలంనాటి నుండి కార్మికులు పోరాడి ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న 29 చట్టాలను నరేంద్ర మోడీ నాలుగు లేబర్ కోడులుగా విభజించి యజమానులకు అనుకూలం చేసి కార్మికులను బానిసలుగా చేయడానికి నరేంద్ర మోడీ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఈ లేబర్ కోడ్ లు అమలు అయితే పని గంటలు పెరుగుతాయని, పని భారం పెరుగుతుందని, కనీస వేతనాలు అమలు కావని, కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొన్నారు.ఈ లేబర్ కోడులు రద్దు అయ్యేంతవరకు పోరాడుతామని వారు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు, వెంకటేశ్వర్లు, సి నాగన్న, తారేష్ రెడ్డి, లక్ష్మన్న, శేఖర్, ఎస్ ఉస్మాను, అంగన్వాడి వర్కర్ సీనియర్ నాయకులు డి మదర్ బి, కృషిద్బి, సాజిదా, లక్ష్మీ ప్రసన్న, పద్మావతి, ఆశ వర్కర్స్ నాయకులు, నజీర్నిశ, సావిత్రి, మున్సిపల్ వర్కర్స్ నాయకుల ఎస్ బషీద్, నాగన్న, ప్రతాప్, వివో ఏ సంఘం నాయకులు పుల్లంరాజు, ఈశ్వరమ్మ, గంధం హుస్సేన్ అమ్మ, మద్దమ్మా, బిరమ్మ శ్రీనివాసులు, రామ్ రెడ్డి, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రంజాన్ ఉపవాస కాలెండర్ ఆవిష్కరణ



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 12. (నంది పత్రిక ):** నంద్యాల: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా, నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాష సిద్ధికి ఆధ్వర్యంలో 'రంజాన్ ఉపవాసాల టైం టేబుల్ (క్యాలెండరు)' ను ఘనంగా ఆవిష్కరించారు.పవిత్ర రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు (రోజా) పాటించే భక్తులకు సెహ్రీ మరియు ఇఫ్తార్ సమయాల పట్ల స్పష్టతనిచ్చేందుకు ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.జిల్లాలోని భౌగోళిక పరిస్థితులను బట్టి ఖచ్చితమైన సెహ్రీ ముగింపు మరియు ఇఫ్తార్ ప్రారంభ సమయాలను ఇందులో పొందుపరిచారు. **పవిత్రత:** రంజాన్ మాసం కేవలం ఉపవాసానికే పరిమితం కాకుండా, ప్రార్థనలు, దానధర్మాలు మరియు క్రమశిక్షణతో కూడిన జీవనానికి నిదర్శనమని ఇమాములు పేర్కొన్నారు. **పుణ్యఫలం:** ఈ నెలలో చేసే ప్రతి మంచి పనికి అల్లాహ్ డెబ్బై రెట్లు అధిక పుణ్యఫలాన్ని ప్రసాదిస్తారని, పేదలకు సహాయం చేస్తూ భక్తిశ్రద్ధలతో గడపాలని వారు పిలుపునిచ్చారు. "ముస్లిం సోదరులందరూ ఈ కాలెండర్ ఆధారంగా సమయపాలన పాటిస్తూ, పవిత్ర రంజాన్ మాసం యొక్క పూర్తి పుణ్యఫలాన్ని పొందాలని కోరుకుంటున్నాము.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షులు,అంజాద్ బాషా సిద్ధికి హాఫిజ్ అబ్దుల్ సలాం హాఫిజ్ ఇంతియాజ్ మౌలానా అబ్దుల్ రౌఫ్ మౌలానా అబ్దుల్ కలాం మౌలానా అబ్దుల్లా మన్సూర్ ఖాజా హుస్సేన్ రజాక్ అబ్దుల్ రహమాన్ అబ్దుల్ మజీద్ షాకీర్ ఖాజా మరియు పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదుల ద్వారా ఈ క్యాలెండర్లను భక్తులకు పంపిణీ చేయనున్నారు. ప్రతి సంవత్సరం రంజాన్ సమయపాలన టైం టేబుల్ క్యాలెండర్ పంపిణీకి చేయూతనిందిస్తున్న నంద్యాల అంజన సంస్థ అధ్యక్షులు ఎన్ ఎం డి ఖుదుస్ కు ఇమాముల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.త



# శ్రీశైలం లో శివ స్వాములపై జరిగిన సంఘటన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే

## జిల్లా పోలీస్ అధికారుల పై చర్యలు తీసుకోవడం సమంజసం కాదు....

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు




**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 12. (నంది పత్రిక ):** నంద్యాల జిల్లా ఈనెల 10వ తేదీన శ్రీశైలంలో శివ స్వామి భక్తులపై జరిగిన సంఘటనకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. నంద్యాల జిల్లా పోలీసులపై చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించడం సరైన నిర్ణయం కాదని జరిగిన ఘటనపై సస్పెండ్ చేయాలనుకుంటే రాష్ట్రస్థాయి పోలీసులపై అలాగే ఇంటిలిజెన్స్ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడుఅభిప్రాయపడ్డారుగురువారం స్థానిక భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా ఎన్. రంగ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది "మహాశివరాత్రి పర్వదిన పండుగను" పురస్కరించుకొని శైవ క్షేత్రాలకు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ విభాగానికి తెలిసిన విషయమే. ముఖ్యంగా శ్రీశైలం దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర తెలంగాణ అలాగే తమిళనాడు రాష్ట్రాల నుంచి శివ స్వాముల తో పాటు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.కానీ రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ విభాగం సరైన సమాచారము తెలియజేయకపోవడం అలాగే అటవీశాఖ అధికారుల తప్పిదాల వల్ల లాఠి చార్జి సంఘటన జరగడందురదృష్టకరమన్నారు. అయినా నంద్యాల జిల్లా స్థాయి పోలీస్ యంత్రాంగం మరల ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త పడడంఅభినంద నీయమన్నారు.కాగా మహాశివరాత్రి వేడుకలు ఇంకా నాలుగు రోజులపాటు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు. అందువల్ల టిడిపి జనసేన బిజెపి పార్టీలకూటమి ప్రభుత్వశీ సంఘటనకు ముందు వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త పడటం సంఘటనకు దారితీసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిసిన జిల్లా పోలీసులపై నెట్టడం సరైన పద్ధతి కాదనితెలియజేశారు. పాత్రికేయుల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శిఎస్. బాబా ఫక్రుద్దీన్, ఏఐటియుసిజిల్లా కార్యదర్శి సుంకయ్య, ఏఐటియుసి నాయకులు మురళీధర్ భూమని శ్రీనివాసులు హరినాథ్ పాల్గొన్నారు

# శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీలో కెరీర్ ప్రోగ్రామ్

**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 12. (నంది పత్రిక ):** శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజ్ (స్వయం ప్రతిపత్తి), నంద్యాలలోని సంబంధిత కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లోని ఐఈఈఈ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ సొసైటీ ఎడ్యూస్కిల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ రెడీ కెరీర్ స్టాయింగ్ రెలేవంట్ ఇన్ అన్ అయి డ్రివెన్ వరల్డ్" అనే అంశంపై ఒక రోజు కెరీర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం ఫిబ్రవరి 12 2026 న ఉదయం 11:00 గంటలకు నిర్వహించగా, విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ పాత్రలు మరియు అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాల గురించి విస్తృత అవగాహన కల్పించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఆటోమేషన్ మరియు డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, తయారీ, హెల్త్‌కేర్, ఫైనాన్స్ మరియు సైబర్ సెక్యూరిటీ వంటి పరిశ్రమలను ఎలా పునర్నిర్మిస్తున్నాయనే దానిపై సెషన్ దృష్టి సారించింది. ఈ కార్యక్రమానికి అభిషేక్ సింగ్, హెచ్ ఆర్ రెడ్ డోర్జ్ అధిపతి రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త గా (కోఆర్డినేటర్) ఎం.అమరేశ్వర కుమార్ , వ్యవహరిశీచగా, కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డా.ఎస్.ఎం.డి.ఫరూక్ మరియు డీన్ సిడిసి డా. జే .డేవిడ్ సుకీర్తి కుమార్ సంపూర్ణ సహకారం అందించారు.ఈ కెరీర్ ప్రోగ్రాం ద్వారా బీటెక్ విద్యార్థులకు పరిశ్రమలో అవసరమైన నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికతలు, మరియు కెరీర్ మార్గాలపై స్పష్టమైన అవగాహన కలుగుతుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.



# పాలకుల వైఫల్యంతోనే సీమ సాగునీటి రంగం అస్తవ్యస్తం



**'ఎత్తిపోతల' అనీ.. 'గోదావరి బనకచర్ల' అనీ సీమ ప్రజలను మభ్యపెడుతున్నారు.**

**నంద్యాలలో 'సీమకు కావాలి - విచక్షణ జ్ఞానం' పాట విడుదల..**

**ప్రాజెక్టుల సాధనే లక్ష్యం!**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 12 ( నంది పత్రిక ) రాయలసీమ అభివృద్ధి కోసం నందమూరి తారకరామారావు, వైయస్ రాజశేఖరరెడ్డి గార్లు చేపట్టిన పలు ప్రాజెక్టులను వారి వారసులైన చంద్రబాబునాయుడు, జగన్మోహన్ రెడ్డి గార్లు కొనసాగించకపోవడం వలన రాయలసీమ సాగునీటి రంగం తీవ్ర అస్తవ్యస్తంగా తయారయిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల కిందట మొదలైన తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు - నగరి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వలన నిర్దేశిత ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందదక పోవడం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఇది పాలకుల వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు నుండి ముప్పై రోజులలో రోజుకు నాలుగు టియంసిల చొప్పున 120 టియంసిల నీరు తెచ్చే అవకాశాలు వున్నప్పటికీ ఇది వదిలిపెట్టి ఒకరేమో రాయలసీమ ఎత్తిపోతల అని మరొకరేమో గోదావరి బనకచర్ల అని ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాయలసీమతో పాటు సమగ్ర ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికై ప్రజలలో చైతన్యం, సామాజిక అవగాహన పెంపొందించడానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆద్వర్యంలో గురువారం నంద్యాల పట్టణంలోని ×హీూ హాల్ నందు

"ప్రతి మనిషీ లోకజ్ఞానే !
ప్రతి మనిషీ తత్వవేత్తే !
ప్రతి వ్యక్తీ చైతన్యవంతుడే !
సీమకు కావాలి విచక్షణ జ్ఞానం !" గీతాన్ని గురురాజ గ్రూపు సంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, ప్రముఖ జుచీ వైద్య నిపుణులు డాక్టర్ మధుసూదనరావు, విశ్రాంత ూదీ× మేనేజర్ సిద్ధిఖీ లతో పాటను ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగించేలా పాటను గీతాన్ని రూపొందించిన దశరథరామిరెడ్డికి అభినందనలు తెలుపుతూ రాయలసీమ అభివృద్ధికి కోసం రాయలసీమ సాగునీటి సాధన సమితి చేపట్టే కార్యక్రమాలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి మన హక్కులను సాధించుకోవడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాహితీ వేత్తలు మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి కోసం తాము కూడా సాహిత్యాలతో రాయలసీమ ఉద్యమానికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అంతకుముందు బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్, తెలుగుగంగ, యస్ ఆర్ బి సి, ఎస్కేప్ ఛానల్ దగ్గర జరిగే అస్తవ్యస్త నీటి విడుదల గురించి తద్వారా ఆయా ప్రాజెక్టుల రైతులు పడుతున్న కష్టాలతో రూపొందించిన డాక్యుమెంటరీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణారెడ్డి, న్యాయవాదులు శంకరయ్య, అసదుల్లా, నందిరైతు సమాఖ్య అధ్యక్షులు బెక్కం రామసుబ్బారెడ్డి, ఉప్పలపాటి బాలీశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, సాహితీవేత్తలు అన్నెం శ్రీనివాసరెడ్డి, కొప్పుల ప్రసాద్, మహమ్మద్ రఫి, గాయకులు శివరామిరెడ్డి, నారాయణగౌడ్, బాలవుశేని, ఆల్ మదర్ ఫౌండేషన్ నాయకులు ఆకుమల్ల రహీం, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ ఎజియం శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శివుడి వేషధరణ నాటక ప్రదర్శనలో ప్రశంస పత్రం అందుకున్న డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు.



నందికొట్కూరు ఫిబ్రవరి 12( నంది పత్రిక) శ్రీ మల్లికార్జున నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీశైలంలో నిర్వహించిన శివ లీలలు నాటకంలో నందికొట్కూర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు శివ దీక్ష శిబిరం వద్ద గల కళావేదికలో శివుడి వేషధారణ పాత్రలో నాటక ప్రదర్శన కొనసాగించారు. శివుని వేషధారణ పాత్రలో విశేషంగా ఆకట్టుకున్న డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులను శ్రీ మల్లికార్జున నాట్యమండలి మరియు నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి సన్నిధానంలో శ్రీ మల్లికార్జున నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన నాటక ప్రదర్శనలో శివుడు వేషధారణ పాత్రలో నటించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో 100 రోజుల ప్రణాళికను తనిఖీ చేసిన డిఇఓ



బనగానపల్లె ఫిబ్రవరి 12 నంది పత్రిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వము ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా ఉన్నత విద్యాధికారి జనార్దన్ రెడ్డి గురువారము పరిశీలించారు. ముందుగా బనగానపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను సందర్శించడం జరిగినది 100 రోజుల ప్రణాళిక లో భాగంగా 10 వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలు తనిఖీ చేయడం జరిగింది తర్వాత బోధనా సిబ్బంది తో జరిగిన సమావేశము లో 10 వ తరగతి విద్యార్థుల ప్రగతి గురించి 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఏ విధంగా విద్యార్థుల ను సన్నద్ధత చేయాలో ,వారికి బోధన మాత్రమే కాకుండా బాలికలకు అవసరమైన అన్ని విషయాలలో కావలసిన సలహాలు సూచనలు ఇస్తూ వారి అభివృద్ధి కి తోడ్పడాలని సూచించారు అనంతరం మధ్యాహ్న భోజనం కు తయారవుతున్న పదార్థాలు గురించి వంట నిర్వాహకులను ప్రశ్నించడం జరిగినది. అనంతరము మోడల్ స్కూల్ ను సందర్శించి అక్కడ 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీజూ లు స్వరూప ,శ్రీనివాసులు ,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పసికూన నమీబియాను కుమ్మేసిన టీమిండియా

టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో నమీబియాపై 93 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమగ్ర ప్రదర్శన కనబరిచిన భారత్, ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు నమీబియా బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు.

## కార్మికుల హక్కులు పరిష్కారం చేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తాం. సిఐటియు




బనగానపల్లె ఫిబ్రవరి 12 నంది పత్రిక సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర కమిటీ పిలుపు మేరకు బనగానపల్లెలో నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారము ఎండిఓ ఆఫీస్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో సీఐటీయూ జిల్లా నాయకులు జెవి సుబ్బయ్య, అంగన్వాడి జిల్లా అధ్యక్షులు శోభారాణి, రోజారమణి, నాగమణి, మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను నాశనం లేపుతూ కార్పొరేట్లకు ఊడిగం చేయడానికి రెడ్ కార్పెట్ వేస్తుందని దీనికి నిదర్శనం గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చింది. అలాగే గ్రామీణ ఉపాధి ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి స్కిమ్ గా జీవో తీసుకురావడం చాలా అన్యాయమని వారన్నారు. ఇవే కాకుండా స్కీం వర్కర్స్ పనిబారం పెంచి కనీస వేతనాలు అమలు చేయకుండా చాలా అన్యాయం చేస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను తీవ్రంగా ఖండించారు.

## రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

**దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



శ్రీశైలం / నంద్యాల జిల్లా, ఫిబ్రవరి 12:-(నంది పత్రిక) మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో గురువారం సాయంత్రం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రం దేశవ్యాప్తంగా విశిష్ట స్థానం కలిగిన శైవక్షేత్రమని, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ చేయడం ఆనందంగా ఉందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ మంత్రికి వివరించారు. ఆలయ ఏర్పాట్లు, భక్తులకు అందిస్తున్న సదుపాయాలపై మంత్రికి వివరాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల పురోగతికి బాటలు

**రూ. 102 కోట్లతో భారీ బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం**

**అభివృద్ధి పనుల్లో పారదర్శకత, వేగవంతమైన పనులు**

**మంత్రి ఫరూక్ కు ప్రత్యేక అభినందనలు తెలిపిన తెలుగుదేశం పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు, పురప్రముఖులు**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 12 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణ అభివృద్ధి చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైందని. మున్సిపాలిటీ ఏర్పడిన 126 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, పట్టణ సర్వతోముఖాభివృద్ధి కోసం మున్సిపల్ కౌన్సిల్ రూ. 102 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించిందని. ఇంతటి భారీ కేటాయింపులపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రత్యేక చొరవ** రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు నంద్యాల పట్టణ రూపురేఖలు మార్చాలనే సంకల్పంతో తీసుకున్న చొరవ ఈ బడ్జెట్‌కు కీలకంగా మారిందని. వారి కృషి ఫలితంగానే ప్రభుత్వం నుంచి రూ. 100 కోట్ల ప్రత్యేక గ్రాంట్ మంజూరు అయిందని. ఈ నిధులతో పట్టణంలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పడుతున్నాయన్నారు. ఈ బడ్జెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన టౌన్ ప్లానింగ్ మరియు రెవెన్యూ విభాగాల అధికారుల పనితీరును కౌన్సిల్ ప్రత్యేకంగా అభినందించిందని. నిధుల సమీకరణ, ప్రణాళికాబద్ధమైన కేటాయింపుల ద్వారా నంద్యాలను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని నేతలు పేర్కొన్నారు. నంద్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి ఫరూక్ గారికి నంద్యాల తెలుగుదేశం పార్టీ నాయకులు, నంద్యాల పట్టణ ప్రజలు , పురప్రముఖులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే.. కేంద్ర ప్రభుత్వానికి పతనం తప్పదు.

**పిక్కిలి వెంకటేశ్వర్లు.**

**అఖిల భారత కిసాన్ రాష్ట్ర నాయకులు.**




నందికొట్కూర్ ఫిబ్రవరి 12( నంది పత్రిక) కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని , జి రామ్ జి పథకాన్ని రద్దు చేసి, అంగన్వాడి ఆశ అవక్కర్ల వేతనాలు పెంచాలని, 8 గంటల పని దినాలను అమలు చేయాలని , స్కీం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పక్షంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని పతనం తప్పదని అఖిల భారత కిసాన్ రాష్ట్ర నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం నందికొట్కూరు పట్టణంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అట్ల భారత కిసాన్ సంఘం మరియు సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక ఎస్బిఐ బ్యాంకు ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికుల సంక్షేమ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వం నశించాలని, లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, ఆశ అంగన్వాడి స్కీం వర్కర్ల వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గళమెత్తారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసి ఆధ్వర్యంలో వినూత్నంగా కార్మికులు ఉరి తాళ్ళతో నిరసన

**దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసన**

**నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కోరుతూ సమ్మె**




నందికొట్కూర్ ఫిబ్రవరి12( నంది పత్రిక) కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం నందికొట్కూరు పట్టణంలోని పటేల్ కూడలిలో సిపిఐ అనుబంధ,ఏఐటియూసి ఆధ్వర్యంలో కార్మికులు వినూత్నంగా ఉరి తాళ్ళతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటియూసి నంద్యాల జిల్లా అధ్యక్షుడు వి.రఘురాం మూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం కార్మికుల సంక్షేమం కోసం 29 కార్మిక చట్టాలను ప్రవేశపెట్టడం జరిగిందని, కాగా ప్రస్తుతము అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి, కార్మిక హక్కులను కాలరాసేందుకు కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆయా ప్రభుత్వ రంగ సంస్థల్లో 12 గంటల పని విధానాన్ని రద్దుచేసి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, అదేవిధంగా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనాన్ని అందజేసేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రెండు వందల రోజుల పని దినాలను కల్పించాలని, అదేవిధంగా ఉపాధి వేతనాన్ని రోజుకు రూ 600 చెల్లించాలన్నారు. స్కీమ్ వర్కర్స్ కి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నెలకు రూ 26వేల వేతనం మంజూరు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటి, రిటైర్మెంట్ బెనిఫిట్ అందజేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కొరకు కార్మికుల సంక్షేమ బోర్డును పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మిక ,కర్షక వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వము నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఏఐటీయూసి నాయకులు హంద్రీ నీవా శ్రీనివాసులు,రాముడు, మాభాష,రామకృష్ణ,నాగేంద్ర,రవి,ప్రతాప్,ఏపి రైతు సంఘం మండల నాయకులు దేవనూరురమణ,మౌలాలి,నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది.

# మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు

**జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ (నెం : 08562 - 246344) ఏర్పాటు :**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



వై ఎస్ ఆర్ కడప, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 : నంది పత్రిక మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రధాన శైవక్షేత్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని 16 ప్రముఖ శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారని, తరలివచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు, భద్రతా ఏర్పాట్లను కల్పిస్తూ.. పార్వతీపరమేశ్వరుల కళ్యాణోత్సవాలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం.. దేవాదాయ, రెవెన్యూ, పోలీసు శాఖల ద్వారా అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టిందనన్నారు.

**జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ (నెం : 08562 – 246344) ఏర్పాటు :** శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు సమాచార, సహాయం నిమిత్తం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని 21 మంది సిబ్బంది తో 3 షిఫ్టుల్లో 24/7 విధులను కేటాయించడం జరిగిందని ఈ నెల 15న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 14-02-2026 తేదీ నుండి 16-02-2026 తేదీ వరకు.. 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం మోడీ విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి






**కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి**

**ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత కల్పించాలి**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 12 నంది పత్రిక కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కనీస వేతనం అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని తదితర డిమాండ్లతో సిపిఎం, సిపిఐ పార్టీలు మరియు సిఐటియు, ఏఐటీయూసీ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఏఐవైఎఫ్ యువజన సంఘం, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం, యుటిఎఫ్, సర్వ శిక్ష అభియాన్, కస్తూరిబా టీచర్ల విభాగం, మున్సిపల్, గ్రామ పంచాయతీ వర్కర్ల ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలోని ఎమ్మార్వో కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు సుమారు 300 మంది కార్మికులు కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో కార్మిక సంఘాల నాయకులు టి. శ్రీనివాసులు, వి చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రామచంద్రుడు, సిపిఐ ఆళ్లగడ్డ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పార్లమెంటులో తమకున్న సంఖ్య బలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్మికులకు నష్టదాయకమైనటువంటి కార్మిక హక్కులను హరించి వేసేటటువంటి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేస్తుందని, అమెరికాతో వ్యవసాయ ఒప్పందాలు తీసుకొని భారతదేశంలోని రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా చేసేందుకు ఎలాంటి షరతులు లేకుండా మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పండ్లు పాలు పంటలను దిగుమతి చేసుకుంటుందని, రోజురోజుకు ఎరువుల సబ్సిడీలు తగ్గించి వేస్తుందని, మద్దతుల చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. అలాగే పేద కవులు రైతులు మరియు వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వాటి స్థానంలో జి రాంజీ చట్టాన్ని తీసుకువచ్చి ఉన్న ఉపాధి కూలీల కడుపులు కొడుతున్నారని ఉపాధి లేకుండా వ్యవసాయ కూలీలకు మోసం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, పంచాయతీ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, కస్తూరిబా, సర్వ శిక్ష అభియాన్ టీచర్ల వేతనాలు, పిఎఫ్ ,ఈఎస్ఐ, గ్రాటివిటీ, మొదలగు అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల్ని మోసం చేస్తుందని, కేంద్రం ప్రకటించిన లేబర్ కోడ్లను అమలులో భాగంగా ఎనిమిది గంటల పని విధానం నుండి 12 గంటల పని విధానం అమలు చేస్తూ మోడీ గారికి చంద్రబాబు వత్తాసు పలుకుతున్నారు అన్నారు. మోడీ చంద్రబాబు ఇద్దరూ కలిసి దేశంలోని రైతులను కూలీలను కార్మికుల్ని దోచుకుంటూ ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారనిమరియు అమెరికాకు ఊడిగం చేస్తున్నారు., రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రజలందరూ మోడీ చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంల ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, అంగన్వాడి యూనియన్ నాయకురాలు పెద్దక్క, శైలజ, వసుంధర, సీతామహాలక్ష్మి, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా సహా కార్యదర్శి కృపావతి, జయలక్ష్మి, చిన్నమ్మ, సర్వ శిక్ష అభియాన్ కస్తూరిబా నాయకురాలు హుసేన్ బి, మల్లికార్జున, షబ్బీర్, రైతు సంఘం నాయకులు నరసింహుడు, నరసయ్య, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు లతీఫ్, హర్ష, సంతోష్ నాయక్ మున్సిపల్ పంచాయతీ కార్మికుల నాయకులు వెంకటయ్య, సాల్మన్, రాజు, వెంకటపతి ,వసంత కస్తూరిబా నాయకులు హుస్సేన్ బి, తదితరులు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా రివ్యూలేషన్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల కళ్యాణ్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ ప్రదర్శన నిర్వహించారు

# బెంగళూరు నుండి కడప రైల్వే మార్గంపై కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి





**ప్రాంత అభివృద్ధికి కీలకమైన రైల్ వే లైన్ ఏర్పాటు చేయాలని వినతి**

**రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోనే సాధ్యం**

**రైల్ వే లైన్ ఏర్పాటు పై సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్**

**మంత్రి వెంటా ఎంపీ పురందేశ్వరి అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్**

విజయవాడ చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 నంది పత్రిక బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో డిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపీ పురందేశ్వరి , అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరుకడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.



ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

# నాయిని చెరువు వద్ద చిరుత సంచారం



బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 12: ఓంకార పుణ్యక్షేత్రానికి సమీపంలో ఉన్న నాయిని చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత పులి ఒకటి సంచరిస్తూ ఉంది. చిరుత పులి సంచరిస్తున్న సంఘటన పలువురి దృష్టిలో పడటంతో భయాందోళనకు గురయ్యారు. గత పది రోజుల క్రితం నాయిని చెరువు చెంచుగూడెంలో సంచరిస్తూ కుక్కలను వేటాడింది. ఈ విషయం అటవీ శాఖ దృష్టికి రావడంతో చెంచుగూడెంలో కెమెరాలను ఏర్పాటు చేశారు. అధికారులు కూడా గూడెంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీపాలను ఏర్పాటు చేసిన తర్వాత చిరుతపులి జాడ కనిపించలేదు. తిరిగి గురువారం చిరుత పులి ఈ ప్రాంతంలో సంచరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విషయంపై అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

# భూమి కల్గిన రైతులు అందరికీ రైతు కార్డ్ ఉండాలి.



నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 12 ( నంది పత్రిక ) నంద్యాల మండలములోని పుసులూరు , మిట్నాల గ్రామములలోనీ రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సందర్శించి రైతు విశిష్ట సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న సాంకేతిక అంశాలైన డ్రోన్ ఆప్ రైతు ఆప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో భూమి కలిగిన రైతులు అందరూ ప్రభుత్వం ద్వారా ఇస్తున్న రైతు కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఇందుకు గాను వారి గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. రాబోయే కాలంలో ఈ రైతు కార్డు కలిగిన వారికి వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు వర్తింపచేయబడునని , కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు అందరూ డ్రోన్ కు సంబంధించిన ఆప్ ను వారి మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుని, దీని ద్వారా వారి పంటలకు పిచికారి చేసుకొనుటకు క్యాబు బుకింగ్ తరహాలో డ్రోన్ బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే రైతు ఆప్ ద్వారా వ్యవసాయ శాఖ కు సంధించిన వివిధ విషయాలు తెలుసుకోగలరని, ఇందుకుగాను రైతు ఆప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ విధంగా వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ సాంకేతిక అంశాలను రైతులు వినియోగించుకొని వ్యవసాయాన్ని లాభ సాటిగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బాల లింగమయ్య వ్యవసాయ సహాయకురాలు మహేంద్ర, షంషీర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదలకు తప్పకుండా న్యాయం చేస్తాం

**టీడీపీ సీనియర్ నాయకుడు జి.వి. సుబ్బారెడ్డి**



బద్వేల్ ఫిబ్రవరి 12 (నంది పత్రిక ):పట్టణ పరిధిలోని కుమ్మరి కొట్టాల సమీపంలో ఉన్న చెన్నంపల్లి సర్వే నెంబర్ 958/2 భూముల విషయంలో అర్హులైన పేదలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జి.వి. సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానికులతో కలిసి సంబంధిత స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ పట్టాల కింద గతంలో పేదలకు ఇచ్చిన పట్టాలపై సమగ్రంగా పరిశీలన చేపడతామని తెలిపారు. నిజంగా అర్హత కలిగిన పేదలకు మాత్రమే పట్టాలు అందేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పేదలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, టీడీపీ అధికారంలో ఉన్నంత వరకు పేదలకు అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. అర్హులైన వారు తమ వద్ద ఉన్న పట్టాలు, ఆధారాలతో ముందుకు రావాలని సూచించారు. అధికారుల వద్దకు వెళ్లి నిజాయితీగా అర్హత కలిగిన వారికి పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ విషయంలో అర్హులు ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, వాస్తవంగా అర్హత ఉన్న పేదల పక్షాన తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ నిలుస్తుందని జి.వి. సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

# నిరాశ్రయుల పట్ల సేవాభావంతో మెలగండి.

**కమిషనర్ ఎన్. మౌర్య.**





తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12 నంది పత్రిక నిరాశ్రయుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. గురువారం రాత్రి పట్నాల్ వీధి వద్ద మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడ వారికి అందుతున్న సౌకార్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను రుచి చూసి వడ్డించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిరాశ్రయుల పట్ల సేవాభావంతో వ్యవహారించాలని తెలిపారు. వారికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆర్. ఓ. వాటర్ ప్లాంట్ కావాలని అడిగారని ఏర్పాటు చేస్తామని అన్నారు. కమిషనర్ వెంట మెప్మా సి.ఎం.ఎం. లు కృష్ణవేణి, సోము, అమ్మ సేవా ట్రస్ట్ నిర్వాహకులు, ఉన్నారు.



# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం.



## అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే.

మహబూబాబాద్, ఫిబ్రవరి 12(నంది పత్రిక):నేడు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో (ఐదు) మున్సిపల్ పరిధిలల్లో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసి కౌంటింగ్ కోసం సిద్ధంగా ఉంది. జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 98 వార్డులకు, 98 టేబుల్స్, 50 మంది రిటర్నింగ్ అధికారులు, 50 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 122 మంది కౌటింగ్ సూపర్ వైజర్ లు, 239 మంది కౌంటింగ్ అసిస్టెంట్ లను అధికారులు ఏర్పాటు చేశారు.

**కౌంటింగ్ కేంద్రాలు..(5)**

మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ (బాలికల) రెసిడెన్షియల్ స్కూల్ లో 36 వార్డులకు, 36 టేబుల్స్, తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆర్యభట్ట హైస్కూల్ లో 16 వార్డులకు 16 టేబుల్స్, మరిపెడ పట్టణ కేంద్రంలో సెంట్ అగస్టీన్ హైస్కూల్ లో 15 వార్డులకు 15 టేబుల్స్, కేసముద్రం పట్టణ కేంద్రంలో ఏఎంసీ కేసముద్రంలో 16 వార్డులకు 16 టేబుల్లు, డోర్నకల్ పట్టణ కేంద్రంలో నిర్మల హైస్కూల్ రైల్వే హాస్పిటల్ లలో 15 వార్డులకు 15 టేబుల్లను అధికారులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది అందుబాటులో ఉంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దీంతో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. విజేతలెవరో.. పరాజితులెవరో... ప్రజల తీర్పుపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.





# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు.

**ఓట్ల లెక్కింపు సందర్భంగా 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్)అమలువిజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధం**

**ఎలక్షన్ కమిషన్ గుర్తింపు కార్డులు ఉన్న వారికే లెక్కింపు కేంద్రంలో ప్రవేశం.**

**జిల్లా ఎస్పీ డా.శబరీష్, ఐ.పి.ఎస్**

మహబూబాబాద్, ఫిబ్రవరి 12(నంది పత్రిక): మహబూబాబాద్ జిల్లా లోని మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, తొర్రూరు, మరిపెడ కేంద్రాలలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా.శబరీష్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెక్షన్ శుక్రవారం ఉదయం 6 గంటల నుండి శనివారం ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలు, టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే అభ్యర్థులు, వారి ఏజెంట్లు నిషేధిత వస్తువులు అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిల్స్, పేలుడు పదార్థాల వంటి భద్రతకు హానికరమైన ఎలాంటి వస్తువులు లెక్కింపు కేంద్రంలోకి తీసుకురాకూడదని తెలిపారు. తనిఖీలు నిర్వహించే సిబ్బందికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారికే లెక్కింపు కేంద్రంలో ప్రవేశం కల్పించబడుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళిని గౌరవించి శాంతి భద్రతలకు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ తరపున విజ్ఞప్తి చేశారు.



# నూజివీడు పట్టనాన్ని త్వరలో స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడానికి రూ.6కోట్లు మంజూరు చేయించిన మంత్రి కొలుసు పార్థసారధికి అభినందనలు

**రూ 6 కోట్లత పట్టణంలో పలు అభివృద్ధి పనులు.**

**నూజివీడు పట్టణ కూటమి నాయకులు**



నూజివీడు చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 12: నంది పత్రిక నూజివీడు పట్టణంను ఒక స్మార్ట్ సిటీగా ఇక మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని మాట ఇచ్చిన అనతికాలంలోనే మాట నిలబెట్టుకొని రూ.6కోట్ల నిధులు మంజూరు చేసి త్వరలో స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దే ఆలోసనతో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ శారది శరవేగంగా పనులు ప్రారంభించబోతున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేసిన కూటమి నాయకులు. మంత్రివర్యులు ఉన్నత ఆశయాలతో అభివృద్ధే తమ లక్ష్యంగా పనిచేస్తూ నియోజకవర్గాన్ని మరియు నూజివీడు పట్టణాన్ని అభివృద్ధి లో పరుగులు పెట్టిస్తూ రూ.6కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిన సందర్భంగా కూటమి నాయకులు మంత్రివర్యుల కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నియోజకవర్గములోని ఇప్పటికే అన్ని మండలాల్లో బి, టి, సి, సి, రోడ్లు ఇప్పటికే మునుపెన్నడూ లేని విధంగా రహదారులు నిర్మించిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి. మరో అడుగు ముందుకేసి అభివృద్ధిలో రారాజుగా నిలిచారని అన్నారు.పట్టణంలో సుమారు.రూ.6కోట్లతో నూజివీడు పట్టణంలో బి, టి, రోడ్లు సి, సి, రోడ్లు మరియు పార్క్ స్మశాన వాటిక, సెంట్రల్ లైటింగ్. పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్మించడానికి కంకణం కట్టారన్నారు.ఏనాడైనా గత ప్రభుత్వం అభివృద్ధి గూర్చి ఆలోసించారా అని ప్రశ్నించారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యి శరవేగంగా పనులు చేపడుతున్నారని తెలిపారు. ఆర్, టి, సి, బస్టాండ్ నుండి రాజీవ్ సర్కిల్ వరకూ రూ.61 లక్షల బీ, టి, రోడ్డు, చిన గాంధీ సెంటర్ నుండి హనుమాన్ జంక్షన్ రోడ్డు ఎన్, టి, ఆర్,విగ్రహం వరకూ రోడ్డు వెడల్పు చేస్తూ రూ.1.32 కోట్లు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ నిమిత్తం. రూ.63లక్షలు. పట్టణంలో సి, సి, రోడ్ల అభివృద్ధి కి రూ.1కోటి. పట్టణంలో సి, సి,రోడ్లు మరియు డ్రైనేజి అభివృద్ధి నిమిత్తం రూ.1.64.కోట్లు. పట్టణంలోని పార్కు అభివృద్ధి కి రూ.40లక్షలు.పట్టణంలోని స్మశానవాటిక అభివృద్ధి నిమిత్తం. రూ.40లక్షల ఇలా పలు అభివృద్ధి పనులు ప్రారంభించి శరవేగంగా పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తారన్నారు. నూజివీడు అభివృద్ధి కి ఇటు నూజివీడు పట్టణ అభివృద్ధికి,పట్టణాన్ని ఒక ఉన్నత నగరంగా స్మార్ట్ సిటీ గా అభివృద్ధి చేయడానికి అహర్నిశలు పని చేస్తున్న మంత్రివర్యులకు నియోజకవర్గ ప్రజలు మరియు కూటమి నాయకులంతా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల నుండి నియోజకవర్గము అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నియోజక వర్గాన్ని అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిస్తున్న మంత్రికి నియోజకవర్గ,మరియు పట్టణ ప్రజలు తమ కృతజ్ఞతలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారని అది తెలుగుదేశం పార్టీ గొప్పదనం అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఒక్క తట్ట మట్టికూడా వేయని రహదారులు కూడా ఇప్పుడు కోట్లు వెచ్చించి చక్కటి రోడ్లు నిర్మిస్తూ మా కష్టాలు గట్టు ఎక్కించి,మా చిరకాల కళ అయిన సెంట్రల్ లైటింగ్, మరియు రోడ్లు వెడల్పు, స్మశాన వాటిక అభివృద్ధి చేస్తూ ప్రజల అవసరాలు ముందుగానే గుర్తెరిగి నెరవేరుస్తున్న మంత్రివర్యులు పట్ల ప్రజలు ఎంతో కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేస్తూ రానున్న 15 ఏళ్ళు కూటమి ప్రభుత్వమే ఉంటుందన్నారు. ఇలాంటి శాసన సభ్యులు ఉండడం మా అదృష్టం అని చిరకాలం మీరే మాకు శాసన సభ్యులుగా వుండాలని కోరుకుంటున్న నియోజకవర్గ ప్రజలు కూటమి నాయకులు కార్యకర్తలు అని తెలియజేసారు. మరియు బోరాంచ గ్రామానికి సుమారు. రూ.5 లక్షలతో పనులు ప్రారంభించి దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజి సమస్య కూడా త్వరలో తీరబోతుందన్నారు.కార్యకర్తలు అభివృద్ధికి శాస్వత చిరునామ మంత్రివర్యులు కొలుసు పార్థసారధి.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేసముద్రంలో పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్ష కేంద్రం ఏర్పాటు.



కేసముద్రం, ఫిబ్రవరి 12(నంది పత్రిక):ఈ సంవత్సరం మే 13న నిర్వహించనున్న పాలిసెట్2026 ప్రవేశ పరీక్షకు సంబంధించి పరీక్షా కేంద్రాన్ని తొలిసారిగా కేసముద్రం ప్రాంతంలో ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. కేసముద్రం (స్టేషన్)లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపారు. ప్రాంతీయ విద్యార్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయడానికి దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో స్థానికంగా కేంద్రం ఏర్పాటు కావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సందర్భంగా కేసముద్రం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఈగ మల్లికార్జున మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూర ప్రాంతాలకు ప్రయాణించి ఇబ్బందులు పడకుండా, సమయానికి పరీక్షా కేంద్రానికి హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రాంతంలోనే పరీక్షా కేంద్రం ఏర్పాటు కావడం వల్ల విద్యార్థులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు మరింత సౌకర్యవంతంగా పరీక్ష రాసే అవకాశం లభించనుంది.

# అన్నదానమే పరమావధి.. 14 ఏళ్లుగా నిరంతర సేవ





**-బైర్లూటి వద్ద వద్ద లక్ష మందికి పైగా భోజన సదుపాయంలి**

**-ఆదర్శప్రాయం.. సుబ్బ సత్యనారాయణ శర్మ సేవా యజ్ఞం**

నంది పత్రిక. నంద్యాల ప్రతినిధి . “అన్నం పరబ్రహ్మ స్వరూపం“.. ఈ మాటను అక్షరాలా పాటిస్తూ ఆకలితో ఉన్న వారికి కడుపునిండా భోజనం పెట్టడమే అసలైన భక్తిగా భావిస్తున్నారు కంపమల్ల సుబ్బ సత్యనారాయణ శర్మ. గత 14 ఏళ్లుగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన నిర్వహిస్తున్న అన్నదాన సేవలు నేడు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలోని బైర్లూటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఈ సేవా యజ్ఞం నిరంతరాయంగా సాగుతోంది. లక్ష మందికి పైగా తృప్తిగా..మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే వేలాది మంది భక్తులకు బైర్లూటి వద్ద ఎవరికీ ఆకలి తెలియకూడదన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటివరకు దాదాపు లక్ష మందికి పైగా భక్తులు ఇక్కడ భోజన ప్రసాదాన్ని స్వీకరించడం విశేషం. కొత్తూరు సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు నాగ పుల్లయ్య శర్మ, వీరయ్య శర్మల మార్గదర్శకత్వంలో, సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

కొత్తూరు దేవస్థానం బ్రాహ్మణ సత్రం శిష్య బృందం ఈ కార్యక్రమంలో అంకితభావంతో సేవలందిస్తోంది. కులమతాలకు అతీతంగా సాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమంపై స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మేడారం మహాజాతర హుండీ లెక్కింపు పూర్తి

**- 828 హుండీలతో రూ.13.25 కోట్ల ఆదాయం**

**- హుండీలలో విదేశీ కరెన్సీ, బంగారం, వెండి లభ్యం.**

ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 12:( నంది పత్రిక) ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర హుండీ లెక్కింపు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన లెక్కింపులో మొత్తం 828 హుండీలను తెరిచి నగదు, ఆభరణాలను లెక్కించారు.వారం రోజుల పాటు సుమారు 400 మంది సిబ్బంది దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.13,25,83,269 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. హుండీల్లో నగదుతో పాటు విదేశీ కరెన్సీ, రద్దు నోట్లు, బంగారం, వెండి ఆభరణాలు కూడా లభించాయి.గత మహాజాతరలో 540 హుండీల ద్వారా రూ.13.25 కోట్ల ఆదాయం నమోదవగా, ఈసారి 828 హుండీలు ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు సమాన స్థాయిలోనే ఆదాయం రావడం విశేషం. హుండీల సంఖ్య గణనీయంగా పెరిగినా ఆదాయం పెరుగుదల పరిమితంగానే ఉండటం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు.భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే మేడారం జాతరలో లక్షలాది మంది పాల్గొనగా, హుండీ ఆదాయం కూడా భారీ స్థాయిలో నమోదవడం



దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడనుంది. లభించిన నగదు, ఆభరణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో జమ చేయనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

# అడవిలోకి వెళ్లే ముందు జాగ్రత్తలు



బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 12: మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పుణ్యక్షేత్రాలకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని అటవీ రేంజ్ అధికారి నాసిర్ ఝూ తెలిపారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ, ఓంకారం, గుండ్ల బ్రహ్మేశ్వరం, మహానంది పుణ్యక్షేత్రాలు అటవీ ప్రాంతాలలో ఉన్నాయని పేర్కొన్నారు. అడవులు దట్టంగా విస్తరించడంతో జంతువుల సంచారం కూడా అధికమైందని అన్నారు. ఈ కారణంగా భక్తులు పుణ్యక్షేత్రాలకు వచ్చేటప్పుడు అగ్గిపెట్టెలు తీసుకొని రావద్దని అన్నారు. నిర్లక్ష్యంగా బీడీలు సిగరెట్లు కాల్చడం వల్ల అటవీ ప్రాంతానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుందని అన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ సంచులు కూడా తీసుకొని రావద్దని అన్నారు. సంచులు ఎక్కడంటే అక్కడ పడేయడం వల్ల జంతువులు తిని చనిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అటవీ ప్రాంతాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందన్నారు. ప్రజలు అటవీ శాఖ సూచిస్తున్న సలహాలను పాటించి అటవీ ప్రాంతాన్ని కాపాడాలని రేంజర్ విజ్ఞప్తి చేశారు.

## మామునూరు ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించండి

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు. భేటీలో మామూనూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామూనూరు విమానాశ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించినందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

# సకల ఆనందాలకు నిలయం మహానందీశ్వరుని ఆలయం





## ప్రముఖ ఆధ్యాత్మిక చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

**మహానంది ఫిబ్రవరి 12 (నంది పత్రిక):-** సకల ఆనందాలకు నిలయం మహానందీశ్వరుని ఆలయం అన్నారు.నవనందులకు నిలయమైన ఈ ప్రదేశంలో పుట్టడం ఎంతో అదృష్టం అన్నారు.మహానంది క్షేత్రంలో పోగుల మహేశ్వర్ రెడ్డి,చంద్రశేఖరమ్మ దంపతుల సహకారంతో రూ.30 లక్షలతో నిర్మించిన కళావేదికను ఆయన ప్రారంభించారు.ముందుగా ఆలయానికి వచ్చిన ఈయనకు ఆలయ మర్యాదలతో ఈవో శ్రీనివాస్ రెడ్డి,వేదపండితులు,అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం కళావేదికలో నవనందుల వైభవం,నందీశ్వరుని చరిత్ర గురించి ఉపన్యాసించారు.నంది మండలంలో అడుగుపెట్టడానికి అదృష్టం ఉండాలన్నారు.నవనందులకు నిలయమైన ఈ ప్రదేశంలో పుట్టడం ఎంతో అదృష్టం అన్నారు.స్వయంభుగా వెలసిన మహానందీశ్వరుడు ఆలయం ఎంతో మహిమాన్వితమైనదన్నారు.నందీశ్వరుని జన్మించిన మహానంది పుణ్యక్షేత్రంను సందర్శించడం వలన సకల ఆనందాలు పొందుతారన్నారు. స్వామివారి క్రింద నుంచి నిరంతరం ప్రవహించే కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించడం వలన సర్వపాపాలు,రోగాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు.నవనందుల చరిత్ర గ్రంథాలను ప్రారంభించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రవచనాలను తిలకించారు.రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.






# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీర్యాలీ







## నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దుచేసి 29 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలి స్కీం వర్కర్ల అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు 26000 చెల్లించాలి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ థర్డ్ పార్టీ విధానం రద్దుచేసి అందరిని ప్రభుత్వ పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12** గురువారం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ సిఐటియు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు సమావేశమై ప్రసంగించడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ సిఐటియు ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్, గారలు మాట్లాడుతూ 100 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక వర్గానికి ఉపయోగపడే 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని మతోన్మాద బిజెపి పసిస్టు ప్రభుత్వం ఆ కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పోరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా నాలుగు లేబర్ కోర్స్ గా కుదించడం జరిగినది దాని మూలాన ఈరోజు కార్మిక వర్గం రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడుతున్న దృశ్య కనీస వేతనాలు అడిగే పరిస్థితి ఉండదు ఉద్యోగ భద్రత ఉండదు సమ్మె చేసే హక్కు ఉండదు కనుక లేబర్ కోడ్స్ అన్నిటిని వెంటనే రద్దుచేసి 29 కార్మిక చట్టం యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలి సెంట్రలైజర్ కిచెన్ విధానం రద్దు చేయాలి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సివిల్ సప్లై హమాలీ కార్మిక వర్గాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని మునిసిపల్ గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని అసంఘటిత రంగ కార్మిక సంఘాలైన అమాలి తదితర గ్రామీణ కార్మికులను సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి ఇవన్నీ అమలు జరిగే వరకూ సమరశీల ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అక్క ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి అంజాద్ భాష తెలంగాణ రైతు కూలీ సంఘం ములుగు జిల్లా కార్యదర్శి పల్లెబోయిన స్వామి, అద్యక్షులు బానోత్ నరసింహ, న్యూ డెమోక్రసీ నాయకులు బొమ్మిడి సాంబయ్య, ఏఐటియసి నాయకులు మొలుగూరి రాంబాబు, ముత్యాల రాజు, కొక్కుల రాజేందర్, దేవేందర్,పోరెడ్డి ప్రమీల కమలక్క భారతి భారతి సరోజన రాజకుమారి కుమారి, కొక్కుల రాజేందర్ దేవేందర్ ఐలయ్య శ్యాంసుందర్ బుడిమె సదయ్య మంకీ డి కృష్ణ,, ఆశ నాయకులు నీలాదేవి రమాదేవి, మున్సిపల్ జయాకర్ సుధర్శన్, సి ఐ టి యు, నాయకులు మహేష్, ప్రవీణ్, రవి,తదితరులు పాల్గొన్నారు,



# పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

## పోచమ్మ తల్లి గుడికి పది వేల రూపాయలు విరాళంగా అందించారు... మచ్చాపూర్ గ్రామంలో ప్రధాన సమస్య భూదాన్ భూముల సమస్య పరిష్కరిస్తా... దనసరి అనసూయ సీతక్క రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖా మాత్యులు



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12( నంది పత్రిక )** గురువారం గోవిందరావుపేట మండల మచ్చాపూర్ గ్రామం నందు గ్రామ సర్పంచ్ జంపాల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగే పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖా మాత్యులు దనసరి అనసూయ సీతక్క విచ్చేసి తల్లి యొక్క ఆశీర్వాదం గ్రామ ప్రజలందరిపై ఉండాలని కోరారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ పోచమ్మ తల్లి దేవాలయం చుట్టూ ప్రహరి గోడ నిర్మిస్తానని, తల్లిని దర్శించే భక్తుల కోసం మంచినీటి బోర్ వేయిస్తానని, గుడికి వెళ్ళే దారి సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పోచమ్మ తల్లి దేవాలయానికి పది వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. అలాగే మచ్చాపూర్ గ్రామంలో ప్రధాన సమస్య భూదాన్ సమస్య అని, ఆ సమస్య వల్ల గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తొందర్లోనే కలెక్టర్ తో మాట్లాడి భూదాన్ భూముల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ గార్లతో పాటుగా గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పాల్గొన్నారు.



# ఈ నెల 13న కౌంటింగ్ ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం.

## జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12, ( నంది పత్రిక ):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ములుగు మున్సిపల్ పరిధిలోని డిగ్రి కళాశాల లో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ములుగు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 09 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులు, రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మున్సిపాలిటీకి సంబంధించి 20 వార్డులకు గాను 07 టేబుల్స్ ఏర్పాటు చేసి 3 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన:

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 12,( నంది పత్రిక ):** రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం లో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని సుందరీకరించాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణం లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి,ఆర్డీఓ వెంకటేష్ ఆలయ ఈవో ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల ప్రయోజనాలపై మోడీ అబద్దాలు

## వాణిజ్య ఒప్పందంపై పెద్ద ఎత్తున నిరసనలు

## భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని భారతీయ కిసాన్ యూనియన్ బికెయు ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను తగలబెడతామని తెలిపింది. బికెయు నేత రాకేశ్ తికాయత్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ గురించి మోడీ ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని విమర్శించారు. 1992లో భారత్ తన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచి విదేశాలను అనుమతించిందని, ప్రస్తుత పరిస్థితి కూడా అలాగే ఉన్నదని ఆయన చెప్పారు. 'భారత్-అమెరికా ఒప్పందం జరిగిన తీరు చూస్తుంటే అది మన దేశానికి ప్రమాదకారిగా కన్పిస్తోంది. కాబట్టి దానిపై మనం గళం విప్పాల్సిందే' అని అన్నారు. ఇది ఏకపక్ష ఒప్పందమని, ఒత్తిడితో కుదుర్చుకున్నదని తికాయత్ చెప్పారు. ఈ ఒప్పందం భారత రైతులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికా మన దేశంలోకి సబ్సిడీతో కూడిన వస్తువులను కుమ్మరిస్తుందని, ఫలితంగా మన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించలేరని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడతామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని విలేకరులు ప్రస్తావించగా 'అది అబద్ధం చెబుతోంది. వారు ఏమైనా చెప్పుకోనివ్వండి. నిరసనలు తప్పవు' అని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను గ్రామాలలో రైతులు దగ్ధం చేస్తారని, ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతారని అన్నారు. 'మా ట్రాక్టర్లకు ఢిల్లీ ఎంతో దూరంలో లేదు. అవి సిద్ధంగానే ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం భారత్‌కు న్యాయసమ్మతం కాదని ఆర్జేడీ ఎంపి సుధాకర్ సింగ్ చెప్పారు. ఇది ఉభయులకూ ప్రయోజనకరమైన ఒప్పందం కాదని, భారత్ 18 శాతం సుంకం కడుతుంటే అమెరికా మాత్రం సున్నా టారిఫ్‌కే పరిమితమవుతోందన్నారు. ప్రతిపాదిత విత్తన బిల్లును కూడా ఆయన వ్యతిరేకించారు.

# మందుబాబులకు బ్యాడ్‌న్యూస్..

## తెలంగాణలో వైన్ షాపులు బంద్..

**తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 13( నంది పత్రిక )** తెలంగాణలో రేపు పలుచోట్ల మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ క్రమంలో వైన్ షాపులు, బార్లు మూతపడనున్నాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు మున్సిపాలిటీల్లో కూడా రేపు షాపులు క్లోజ్ కానున్నాయి. తెలంగాణలో ఫిబ్రవరి 13వ తేదీన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ జగనుంది. ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు జరగ్గా.. శుక్రవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. దాదాపు రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. 16న కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉండనుండగా.. మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక కూడా అదే రోజు ఉంటుంది. ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ ముగియగా.. 73.01 పోలింగ్ శాతం నమోదైంది. కార్పొరేషన్లలో 66.05 శాతం నమోదైంది. మొత్తం 38,09,406 ఓట్లు పోలయ్యాయి.

**వైన్ షాప్స్ బంద్** ఫిబ్రవరి 13వ తేదీన ఎన్నికల కౌంటింగ్ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం కౌంటింగ్ జరిగే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో వైన్ షాపులు బంద్ కానున్నాయి. 13వ తేదీన ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఓపెన్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.




**సైబరాబాద్ పరిధిలో మూసివేత** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని ఇంద్రేశం, ఇస్నాపూర్, గడ్డపోతారం మునిసిపాలిటీలతో పాటు కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఎల్లంపేట, అలియాబాద్, ముడిచింతలపల్లి పరిధిలో కూడా మద్యం షాపులు మూసివేయనున్నారు. వైన్ షాపులతో పాటు బార్లు, రెస్టారెంట్లలో మద్యం సరఫరా నిలిపివేయనున్నారు. ఇక ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారం, చిట్కుల్, ఇస్నాపూర్, రుద్రారంతో పాటు గడ్డపోతరం మున్సిపాలిటీలోని గడ్డపోతరం, ఖాజీపల్లి, మాధార, ముడిచింతలపల్లి మునిసిపాలిటీలో మద్యం షాపులు క్లోజ్ కానున్నాయి. అటు రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ జరిగే అన్ని ప్రాంతాల్లో మూసివేయాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**హోరాహోరీగా ఎన్నికలు** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించాయి. ఇక డబ్బులు కూడా భారీగా పెంచారు. మద్యం కూడా పెద్ద ఎత్తున ఓటర్లకు సరఫరా చేశారు. పార్టీలన్నీ పోటాపోటీగా తీసుకోవడంతో మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఎగ్జిల్ పోల్స్ విడుదల అవ్వగా.. కాంగ్రెస్‌కు ఆధిక్యం ఇచ్చాయి. అటు బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా గట్టిగా పోటీ ఇచ్చారు. ఇక బీజేపీ కూడా గట్టి పోటీ ఇచ్చింది. ఈ త్రిముఖ పోరుతో మున్సిపల్ ఎన్నికలు రంజుగా జరిగాయని చెప్పవచ్చు. మరి గెలుపు ఎవరిని వరిస్తుందనేది శుక్రవారం తేలనుంది.

# నిరుపయోగంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్

## ఎస్సీలలో కొరవడిన చైతన్యం



**వెల్దండ ఫిబ్రవరి 12 ప్రతినిధి రామానుజన్** వెల్దండ మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా ఉందని ఎస్సీ మేధావులు, విద్యావంతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ ప్రజల్లో చైతన్యం, పరిజ్ఞానం లేకపోవడంతో లక్షల రూపాయలు నిధులు ఖర్చు చేసి నిర్మించిన హాల్ నేడు నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంలో చౌరస్తాకు అతి సమీపంలో వున్న భవనం నేడు నిరుపయోగంగా మారడంతో దళిత మేధావులు, విద్యావంతులు కమ్యూనిటీ హాల్‌ను వాడుకలోకి తీసుకువచ్చి దళితులను అక్షర జ్ఞానం వైపు మళ్ళించాలని మండలపతరజలు కోరుతున్నారు. గత 10 సంవత్సరాల క్రితం మంచి పుస్తకాలు అందుబాటులో ఉండి గ్రందాలయంగా ఉండి నేడు ఎస్సీ ప్రజల్లో చైతన్యం లోపించడం వల్ల శిథిలావస్థకు చేరింది. ఇప్పటికైనా కమ్యూనిటీ హాల్ పర్యవేక్షకులు స్పందించి పూర్వ వైభవం తీసుకు వచ్చేలా సహకరించాలని వెల్దండ మండల ప్రజలు కోరుతున్నారు.

# దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు

ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచితపథకాల గురింగి డిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది. తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్దిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిం దని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతు లెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లక్ష్మీమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయాను కూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేందప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్నికల సంఘం కూడా ఈ పథకాల ప్రకటనలను నిషేధించాలి. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కిలో రూపాయి బియ్యం ఇందుకు ఉదాహరణ.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

## అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**తెలంగాణ బ్యూరో,ఫిబ్రవరి 12. ( నంది పత్రిక )** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు.అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారంసచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ శ్రీమతి సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో శ్రీ జి. మల్సూర్‌ల యతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706,అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



# మార్చిలో జిల్లా, మండల,పరిషత్‌ల ఎన్నికలు?

## వేగంగా కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం యొక్కరూ.450 కోట్ల నిధులే కీలకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:( నంది పత్రిక)** తెలంగాణ రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను మార్చి నెలలో నిర్వహించే దిశగా ప్రభుత్వం ఆలోచనలు వేగవంతం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మునిసిపల్ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వస్తే అదే ఊపును కొనసాగిస్తూ పరిషత్ ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆవశ్యకత ప్రభుత్వం ముందు నిలిచింది. ఈ ఏడాది లోపల పరిషత్ ఎన్నికలు నిర్వహించకపోతే జిల్లా, మండల పరిషత్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.450 కోట్ల నిధులు నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నట్లు సమాచారం. అభివృద్ధి కార్యక్రమాలపై దాని ప్రభావం పడే అవకాశముండటంతో ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలనే దిశగా యంత్రాంగం చర్యలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.ఇక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రాథమిక స్థాయి సన్నాహాలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. మార్చి తొలి వారంలో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై పరిశీలన కొనసాగుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం సాధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. రాజకీయ పరంగా కూడా ఈ ఎన్నికలు కీలకంగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బలాన్ని నిరూపించుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి. మునిసిపల్ ఎన్నికల ఫలితాల ప్రభావం పరిషత్ ఎన్నికలపై పడే అవకాశం ఉండటంతో అన్ని పార్టీల దృష్టి ఇప్పుడు గ్రామీణ ఓటర్లపై కేంద్రీకృతమైంది. మొత్తంగా చూస్తే ఆర్థిక పరిమితులు, రాజకీయ లెక్కలు రెండూ కలిసివచ్చే నేపథ్యంలో రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల వేడి త్వరలోనే మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత రానుంది.




# నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు

గత నాలుగేళ్లుగా అంటే 2021-2025ల మధ్య కాలంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు. 2025లో ఫ్రాన్స్ సందర్శన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలవనుంది. ప్రధాని మోడీ ఒక్కరే వెళ్లిన ఈ పర్యటన కోసం సుమారు 25.5కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు.

## కాన్పూర్‌లో పాదచారులపై లంబోర్గి కారు ఘటనలో వ్యాపారవేత్త కుమారుడి అరెస్ట్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారుల పైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివంను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ అరెస్టు చోటుచేసుకుంది. కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న లంబోర్గిని కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి అది దూసుకెళ్లింది. దీనికి ముందు ఈ లగ్జరీ కారు ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడిని అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. బుధవారం ఈ కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన లంబోర్గిని కారును నడిపింది శివం కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com